




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 64 | ది. 9-6-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 64 | Date : 9-6-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |


# 2027 నాటికి భూ రికార్డులు క్లీన్

- రికార్డుల పూర్తి ప్రక్షాళనకు 3 ఏళ్ల సమయం
- కరెన్సీ నోట్ల తరహాలో పాస్ పుస్తకాలకు భద్రతా ఫీచర్లు
- రాష్ట్రంలో రాజకీయం చేసే అర్హత గొడ్డలి పార్టీకి ఎక్కడిది..?
- గొడ్డలి పట్టే చేతులకు నాగలి పట్టే చేతులు ఎలా గుర్తుంటాయి...?
- మేం రాజముద్రతో పట్టాలిస్తున్నాం... వాళ్లు దొంగ పట్టాలు సృష్టిస్తున్నారు
- ప్రజలకు, నిరుద్యోగులకు ఆ పార్టీ క్షమాపణలు చెప్పాలి
- సిద్ధాంతంలో మీ భూమి- మీ హక్కు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు







**ఆచంట, జూన్ 8 (వార్తాప్రభ) :** 2027 నాటికి రాష్ట్రంలో భూ రికార్డులను ప్రక్షాళన చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గత పాలకులు పశ్చిమ గోదావరి జిల్లా లాంటి పచ్చని ప్రాంతంలోనూ భూ చిచ్చు పెట్టారని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. గజం భూమిని కూడా సద్వినియోగం చేసుకునే రైతులనూ గత ప్రభుత్వం వదిలి పెట్టలేదని తీవ్రస్థాయిలో ఆరోపించారు. పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలో మీ భూమి- మీ హక్కు పేరిట రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. దుర్మార్గమైన గత పాలకుల నిర్వాకంతో రికార్డులన్నీ గందరగోళంగా తయారయ్యాయని ప్రజలకు చెందిన భూముల విషయంలో సమస్యలు సృష్టించారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూ రికార్డులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేశారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లాంటి దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేసి యాజమాన్య హక్కుల్ని రక్షించామని వివరించారు. క్యూ ఆర్ కోడ్ సహా కరెన్సీ నోట్ల తరహాలోనే అత్యంత పటిష్టమైన భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు చేసిన అవకతవకల కారణంగా భూమి రికార్డుల ప్రక్షాళనకు 3 ఏళ్ల సమయం పడుతుందని సీఎం అన్నారు. దేశంలోనే తొలిసారి బ్లాక్ చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతీ యూనిట్ కు శాశ్వతమైన బ్లాక్ చైన్ ఐడీలు ఇస్తున్నామని.. దీని ద్వారా రికార్డులను ట్యాంపరింగ్ చేసేందుకు అవకాశం ఉండదని తెలిపారు. ప్రజల ఆస్తి పత్రాలపై ఫోటోలు ముద్రించుకున్నారని.. పొలం సరిహద్దు రాళ్లపై బొమ్మల కోసం రూ.800 కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. ప్రస్తుతం భూముల రీసర్వే ప్రక్రియలో రైతులను కూడా భాగస్వాములను చేస్తున్నామని... ఈకేవైసీ చేశాకే పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి రైతులకు అందిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 6688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూమి రికార్డులను అప్డేట్ చేశామని అన్నారు. 26.46 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. వచ్చే 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 67.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. 2027 నాటికి రాష్ట్రంలో ప్రతీ రైతు వద్దా తప్పుల్లేని పాస్ పుస్తకం ఉంటుందని అన్నారు.

**రెవెన్యూ శాఖలో సమూల మార్పులు..** రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని... రీ-సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామని సీఎం వివరించారు. విక్రయం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ తెచ్చామని తెలిపారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేశామని... రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100తో బదిలీ చేస్తున్నామని స్పష్టం చేశారు. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ వంటి పాత రికార్డుల డిజిటైజేషన్ ప్రక్రియ చేపట్టామని అన్నారు. 80 శాతం ఈ-కేవైసీ పూర్తయిన తర్వాతే గ్రామాలను వెబ్ ల్యాండ్ 2.0లోకి తీసుకుంటున్నామని అన్నారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం కల్పించామన్నారు. రాష్ట్రంలోని 1.37 లక్షల ఎకాల విలేజ్ సర్వీసు ఇనామ్ భూములను 22 ఏ నుంచి తప్పించామని తెలిపారు. తిరుపతి జిల్లాలో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న శెట్టిపల్లి గ్రామ భూములను పరిష్కరించి వారికి అప్పగించామన్నారు. అక్వా రైతులకు అండగా నిలబడ్డామని సీఎం స్పష్టం చేశారు. గోదావరి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో పాటు, ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరిచారు. ఆక్వా జోన్ పరిధిలోని చెరువులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. అక్వా ఫీడ్ రేట్లు పెరగడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని రాయితీలు ఇవ్వాలని సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కేంద్రాన్ని కోరామన్నారు. పశ్చిమ గోదావరి లాంటి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై దృష్టి పెట్టామని సీఎం వివరించారు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో భారీ ప్రమాదం... 8 మంది కార్మికులు మృతి



**విశాఖపట్నం,జూన్ 8 (వార్తాప్రభ) :** విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘోర ప్రమాదంలో 8 మంది కార్మికులు చనిపోయారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. స్టీల్ప్లాంట్ మెటల్ లిక్విడ్ లాడిల్ పేలడంతో ఈ ప్రమాదం జరిగింది. మంటలను అదుపుచేసేందుకు ఫైర్ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. మెటల్ లిక్విడ్ లాడిల్ పేలడంతో స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు.వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో భారీ ప్రమాదం జరిగింది. సిసిడి విభాగంలోని లిక్విడ్ స్టీల్ నిర్వహణలో ప్రమాదం జరిగింది. హాట్ మెటల్ బకెట్ కుప్పకూలింది. కార్మికులపై ద్రవ ఉక్కు పడింది. ఈ ప్రమాదంలో 8 మంది కార్మికులు మృతిచెందారు. పలువురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టాయి. మ-రోవైపు ప్రమాదం జరిగిన నేపథ్యంలో స్టీల్ ప్లాంట్‌లో ఆందోళన నెలకొంది.

**సీఎం చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి..** స్టీల్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై ఆరా తీశారు. స్టీల్ ప్లాంట్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ ప్రమాదంలో 8 మంది కార్మికులు చనిపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై పరిస్థితి, సహాయక చర్యలను ముఖ్యమంత్రికి అధికారులకు వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

# ఢిల్లీకి చంద్రబాబు, పవన్

## కేబినెట్ లో మరో బెర్తు.. కీలక నిర్ణయాలు..!!



**అమరావతి, జూన్ 8 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఢిల్లీ వెళ్తున్నారు. కేంద్రంలో మోదీ తన 12 ఏళ్ల ప్రధాని పదవీ కాలం పూర్తి చేసుకొని కొత్త రికార్డు నెలకొల్పారు.అదే విధంగా మూడో సారి అధికారం లోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతోంది. దీంతో.. ఎన్డీఏ పాలిత సీఎంలు.. డిప్యూటీ సీఎంలతో ప్రధాని మోదీ సమావేశం కానున్నారు. కీలక బిల్లుల ఆమోదంతో పాటుగా.. 2029 ఎన్నికలే లక్ష్యంగా ఈ భేటీలో మోదీ దిశా నిర్దేశం చేయనున్నారు. కేంద్ర కేబినెట్ ప్రక్షాళన పైనా నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. సీఎం చంద్రబాబు.. డిప్యూటీ సీఎం పవన్ రేపు (మంగళవారం) ఢిల్లీ వెళ్లను న్నారు. ప్రధాని మోదీ అధ్యక్షతన ఈ నెల 10న జరిగే ఎన్డీఏ ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశంలో వీరు పాల్గొనను న్నారు. మోదీ ప్రభుత్వం కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. దేశవ్యాప్తంగా ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు హాజరుకానుండగా, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, రాష్ట్రాలతో సమన్వయం వంటి అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. అదేవిధంగా, త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంశం కూడా ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల పాత్ర, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలు, రాష్ట్రాల అభివృద్ధి ప్రణాళికలపై కూడా చర్చలు జరగవచ్చని సమాచారం.

**కేంద్ర కేబినెట్.. పదవుల పై చర్చ..** కాగా, ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కీలక అంశాలు, రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్ర సహాయ నిధులు, పెండింగ్‌లో ఉన్న విభజన హామీలపై సీఎం చంద్రబాబు కేంద్ర నాయకత్వంతో చర్చించే అవకాశం ఉంది. ఇక.. కేంద్రంలో జరిగే మంత్రివర్గ ప్రక్షాళనలో ఏపీకి మరో మంత్రి పదవి ఖాయమని తెలుస్తోంది. ఎవరికి ఛాన్స్ ఉంటుందనేది ఈ భేటీ తరువాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అదే విధంగా టీడీపీకి మరో గవర్నర్ పదవి దక్కుతుందనే ప్రచారం సాగుతోంది. చంద్రబాబు ఎవరిని ఈ పదవి కోసం సిఫారసు చేస్తారనేది కీలకంగా మారుతోంది. తాజాగా ఏపీ నుంచి నలుగురు అభ్యర్థులు రాజ్యసభకు నామినేషన్లు దాఖలు చేసారు. వారి ఎంపిక లాంఛనమే. దీంతో.. చంద్రబాబు, పవన్ ఢిల్లీ పర్యటనలో కీలక నిర్ణయాలు జరిగే అవకాశం ఉంది.


దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ విశ్వేశ్వరస్వామివారి దేవస్థానం కల్వపూడి అగ్రహారం, కృష్ణాజిల్లా

**టెండరు కం బహిరంగ వేలంపాట ప్రకటన**

కృష్ణాజిల్లా, గుడివాడ మండలం, కల్వపూడి అగ్రహారం గ్రామంలో వేంచేసియున్న శ్రీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానమునకు సర్వ హక్కు భుక్తములలో గల ఈ క్రింది వుదహరించిన భూములు లీజు లైసెన్స్ హక్కునకు గాను ది. 10-06-2026 బుధవారం మధ్యాహ్నం 3:00 గంటలకు సదరు శ్రీ స్వామివారి దేవస్థానం వద్ద శ్రీయుత తనిఖీదారు దేవదాయ శాఖ, గుడివాడ వారి సమక్షంలో 3 సం॥ల కాలపరిమితికి అనగా (2026-26 నుండి 2028-29 వరకు) లీజు లైసెన్స్ హక్కునకు టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహించబడును. ఆసక్తి కలవారు పాటలో పాల్గొనవలయును.

| వ. నెం. | భూమి ఉన్న గ్రామము | ఆర్.ఎస్. నెం. | విస్తీర్ణం యు. సెం. | ధరావత్తు | వేలంపాట జరుగు స్థలము |
|---|---|---|---|---|---|
| 1 | మోటూరు | 651/1 | 3.23 | 4,000 | శ్రీ విశ్వేశ్వరస్వామివారి దేవస్థానం వద్ద మ॥ 3 గం॥లకు |
| 2 | మోటూరు | 652/2,3 | 3.64 | 4,000 | |
| 3 | మోటూరు | 654/2 | 6.34 | 6,000 | |

కొన్ని ముఖ్యమైన షరతులు

1. ఈ బహిరంగవేలం పాట దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి సంస్థ కార్యనిర్వహణాధికారిచే జరుగుచున్నది.
2. దేవస్థానమునకు బకాయిలు ఉన్నవారు గాని లేదా లావాదేవీలు ఉన్నవారు గాని పాటలో పాల్గొనరాదు.
3. పాటలో పాల్గొనువారు పాటకు ముందుగా తనకు గల స్థిరాస్తి దస్తావేజులు లేక పట్టాదారు పాస్‌పుస్తకం మరియు టైటిల్ డీడ్ హామీగా ఇచ్చి ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొను నిర్ణయం.
4. ఈ వేలం పాట బస్తాల రూపంలో కాకుండా నగదు రూపేణా నిర్వహించబడును.
5. మిగిలిన పాట షరతులు పాట కాలమందు చదివి వినిపించబడును,..
6. ఇతర వివరములకు దేవస్థానం ఆఫీసు పనిచేయు దినములలో సంప్రదించగలరు.
7. వేలం పాటలో పాడుకున్న నగదు మొత్తమును అడ్వాన్స్ రూపంలో ముందుగానే చెల్లించు నిర్ణయం.

కల్వపూడి అగ్రహారం
27-5-2026

ఇట్లు
వంశపారంపర్య ధర్మకర్త



**ప్రజల సంతృప్తే పనితీరుకు గీటురాయి..**

● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

- 8లో


# కాశీ యాత్రలో విషాదం

- బీహార్‌లో టూరిస్టు బస్సు ప్రమాదం.. ముగ్గురు మృతి
- 15 మందికి తీవ్ర గాయాలు.. గయా ఆసుపత్రిలో చికిత్స
- సంగం, ఆత్మకూరు ప్రాంతాల్లో విషాదఛాయలు



**సంగం,జూన్ 8 (వార్తాప్రభ) :** ఉత్తర భారత పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లిన నెల్లూరు జిల్లా భక్తుల యాత్ర విషాదకరంగా మారింది. బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యాత్రికులు మృతి చెందగా, 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుల్లో సంగం మండలానికి చెందిన టూరిస్టు బస్సు నిర్వాహకుడు, రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్ పసుపులేటి వెంకటేశ్వర్లు (64), చవడం హజరత్తయ్య (57), ఆత్మకూరుకు చెందిన సోమా పద్మావతి (43) ఉన్నారు. క్షతగాత్రులను గయాలోని మగధ మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

**కాశీ చేరకముందే ప్రమాదం..** సంగం ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ఈ నెల 1న “శ్రీ సాయి యాత్ర స్పెషల్” పేరుతో టూరిస్టు బస్సు బయలుదేరింది. 15 రోజుల పాటు సాగే ఈ యాత్రలో అన్నవరం, సింహాచలం, పూరి, కోణార్క్, భువనేశ్వర్, వైద్యనాథ్, గయా, బుద్ధగయ, కాశీ, ప్రయాగ్‌రాజ్, అయోధ్య తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించేలా ప్రణాళిక రూపొందించారు. సంగం, ఆత్మకూరు, దుత్తలూరు ప్రాంతాలకు చెందిన 43 మంది భక్తులు, సిబ్బంది యాత్రలో పాల్గొన్నారు. గయా, బుద్ధగయ దర్శనాలు ముగించుకుని కాశీకి బయలుదేరిన బస్సు ఆదివారం రాత్రి 12.10 గంటల సమయంలో గయా సమీపంలో ఎదురుగా వచ్చిన లారీని ఢీకొట్టినట్లు సమాచారం. ప్రమాద సమయంలో ఎక్కువ మంది యాత్రికులు నిద్రలో ఉండటంతో భారీగా గాయపడ్డారు.

**15 మందికి తీవ్ర గాయాలు..** ప్రమాదంలో బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ, నీలం శీనయ్య, పద్మ, కంటాబత్తిన సంపూర్ణమ్మ, కామాక్షమ్మ, గురవయ్య, వింజమూరు శివరంగయ్య, డి.రమణమ్మ, జి.శ్రీదేవి, డి.మల్లేశ్వరి తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. పలువురికి చేతులు, కాళ్లు విరిగినట్లు తెలిసింది.

**సంగంలో విషాదఛాయలు..** ప్రమాద వార్త తెల్లవారుజామున సంగం గ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఇద్దరు గ్రామస్తులు మృతి చెందారని తెలిసి వారి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమ-న్నీరయ్యారు. ముఖ్యంగా చవడం హజరత్తయ్య మృతితో ఆయన కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. కుటుంబ పోషణ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన మృతితో గ్రామస్తులు సైతం తీవ్ర విషాదంలో మునిగిపోయారు.


**ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ పోయినది**

నేను బొట్టా సామ్రాజ్యం, భర్త: లేట్ బొట్టా నాగేశ్వర రెడ్డి, నివాసం: ప్రొద్దుటూరు గ్రామం, కంకిపాడు మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.నాకు చెందిన కొణతనపాడు గ్రామ పరిధిలో గల వ్యవసాయ భూమికి సంబంధించిన ఒరిజినల్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ (డాక్యుమెంట్ నెం. 128/1953), ఆర్.ఎస్. నెం. 42/3, తేదీ 01-06-2026 న ప్రొద్దుటూరు గ్రామంలోని నా నివాసం నుండి జిరాక్స్ నిమిత్తం కంకిపాడు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంతానికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఎక్కడో తప్పిపోయినది.సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ కొరకు అన్ని ప్రాంతాలలో వెతికినప్పటికీ ఇప్పటివరకు లభించలేదు. ఎవరికైనా ఈ డాక్యుమెంట్ లభించిన యెడల దయచేసి క్రింది చిరునామాకు అందజేసి సహకరించగలరు.

ఇట్లు :

బొట్టా సామ్రాజ్యం, భర్త: లేట్ బొట్టా నాగేశ్వర రెడ్డి
ప్రొద్దుటూరు గ్రామం, కంకిపాడు మండలం,
కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.



**LOST SSC CERTIFICATE**

I, Nallamothu Tirupathirao, S/o Suseswara Rao, R/o Yanamadala Village, Nuzvid Mandal, Eluru District, Andhra Pradesh – 521201, hereby inform that my original SSC Marks Memo/SSC Certificate bearing Regd. No. 0146782 has been lost on 25-05-2026.

Despite diligent search, the document could not be traced and is deemed lost. If found, please contact the undersigned or hand it over to the nearest police station. I am applying for a duplicate certificate from the concerned authorities.

Sd/- Nallamothu Tirupathirao
Cell No.9963697968

## ఖాతాదారులకు మేలైన రీతిలో టౌన్ బ్యాంక్ సేవలు




**కాకినాడ, జూన్ 8 (వార్తాప్రభ) :** ది కాకినాడ కోబి ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఖాతాదారులకు మేలైన రీతిలో తగు సేవలు అందించి వారి మన్ననలు పొందుతుందని టౌన్ బ్యాంక్ ఛైర్మన్ చిట్టూరి రవీంద్ర పేర్కొన్నారు. అంతేగాక బ్యాంక్ ఖాతాదారులు వారి దాచుకున్న నగదుపై అధిక వడ్డీ ఇస్తున్నట్లు రవీంద్ర తెలిపారు. ఆదివారం కాకినాడ రాజా ట్యాంకులో ఉన్న హాలులో రామారావు పేట బ్రాంచి ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. సీఏ కంటిపూడి సత్యనారాయణ బ్యాంకు నివేదికను వెల్లడించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రవీంద్ర మాట్లాడుతూ కాకినాడ కోఆపరేటివ్ బ్యాంక్ రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉందన్నారు అలాగే బ్యాంకు డిపాజిట్లు ఋణాలు వంటి వివరాలను ఖాతాదారులకు వెల్లడించారు. బ్యాంకు వేరు సొసైటీ వేరని తెలుసుకోవాలని చెప్పారు. తమ బ్యాంకు సహకార శాఖ, రిజర్వ్ బ్యాంక్ వారు చెప్పిన ఆదేశాలకు లోబడి పనిచేస్తుందన్నారు. బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతుందని ఆ విధంగా బ్యాంకు డైరెక్టర్లు ప్రణాళికలు రూపొందినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఖాతాదారులు అడిగిన సందేహాలను ఛైర్మన్ రవీంద్ర నివృత్తి చేశారు. ఈ సమావేశంలో సీఈవో సిహెచ్ సుగుణ రావు, బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## 14న ఘంటసాల పాటల పోటీలు..




**ఘంటసాల/అవనిగడ్డ,జూన్ 8 (వార్తాప్రభ) :** ఈనెల 14న మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పాటల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఘంటసాల కళా సమితి అధ్యక్ష కార్యదర్శులు ఘంటసాల కృష్ణమోహన్, పోతన వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం వారుస్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మధుర గాయకుని వంశ జన్మశాలైన కృష్ణాజిల్లాలోని ఘంటసాల గ్రామంలో ఘంటసాల కచేరి 60 సంవత్సరాల వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఘంటసాలలోని జలధీశ్వర స్వామి ఆలయం ఆవరణలో ప్రారంభమగు ఈ పోటీలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ మెమెంటోలతో పాటు ఐదు కన్సిలేషన్ మెమెంటోలను ప్రధానం చేయనున్నట్లు వారు వివరించారు. ఈ పాటల పోటీలో పాల్గొనదలచిన గాయనీ గాయకులు ట్రాక్ లేకుండా ఘంటసాల వారు పాడిన పాటలను ఆలపించాలన్నారు. పాల్గొనదలచిన వారు తమ పేరు, వయసు, చిరునామాను పోతన వెంకటేశ్వరరావు 9949988910, మురళీకృష్ణ 7386623213, కృష్ణ మోహన్ 7013656956 నెంబర్లలో ఎవరో ఒకరికి వాట్సాప్ ద్వారా వివరాలు పంపించి, ఫోన్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

## ఈనెల 17న పెడనలో ఉచిత కంటి వైద్య శిబిరం



**పెడన,జూన్ 8 (వార్తాప్రభ) :** ఈనెల 17వ తేదీన పెడనలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. మచిలీపట్నం కు చెందిన నాగమణి రేటీనా సూపర్ స్పెషాలిటీ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్ టీ సి బస్టాండ్ వద్ద వున్న జగన్నాథ నర్సింగ్ హోమ్( డా.అశోక్ )వద్ద ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రోగులకు వైద్య పరీక్ష లు నిర్వహించనున్నారు షుగర్ బీపీ ఉన్నవారికి కంటి నరాల స్కానింగ్ పరీక్షలు కూడా ఉచితంగానే చేయనున్నారు. ఈ హెచ్ ఎస్ ఆరోగ్యశ్రీ కార్డు సదుపాయం కూడా ఉందని ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డా. గొరిపర్తి పవన్ కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని పెడన పట్టణ పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కొంకేపూడి హైస్కూల్ లో విద్యా మిత్ర కిట్ల పంపిణీ



**పెడన,జూన్ 8 (వార్తాప్రభ) :** పెడన లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుండి 10 వ తరగతి చదివే విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభంలో ఇచ్చే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం -2026 ప్రాభాగంగా పెడన లోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్థానిక బట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్ వద్ద నుండి పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు డిక్షనరీలు యూనిఫామ్ లను సోమవారం కొంకేపూడి హైస్కూల్ లో పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ లు సలోమి ఎంఈఓ హరనాథ్ పరిరక్షణలో పంపిణీ చేయుట జరిగినది.

## జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన వైసీపీ పెద్దలు



**విస్సన్నపేట,జూన్ 8 (వార్తాప్రభ) :** స్థానిక మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గద్దెల మల్లయ్యకు జన్మదిన శుభాకాంక్షలు వైసీపీ పెద్దలు తెలియజేశారు. పట్టు శాలువాతో సుగంధ పరిమళాల పూలదండలతో ఘనంగా సన్మానించి అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

# పేదల డాక్టర్ డా. మునస్వామి యాదవ్‌కు ఘన నివాళి

● యాదవ్ భవన్ నిర్మాణాన్ని పూర్తి చేయడమే ఆయనకు నిజమైన శ్రద్ధాంజలి: వక్తలు



**తిరుపతి,జూన్ 8 (వార్తాప్రభ) :** పేద ప్రజలకు జీవితాంతం వైద్య సేవలు అందించి, సమాజ సేవకు అంకితభావంతో పనిచేసిన ప్రముఖ వైద్యుడు, వాసుదేవా యాదవ్ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డా. మునస్వామి యాదవ్ స్మారకార్థం ఆదివారం తిరుపతిలోని హోటల్ ఉదయ్ ఇంటర్నేషనల్‌లో ఘన సంతాప సభ నిర్వహించారు. వాసుదేవా యాదవ్ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంఘం గౌరవ అధ్యక్షులు గంగరాజు యాదవ్ అధ్యక్షత వహించారు. ప్రారంభ ఉపన్యాసంలో వెంకట రామ చంద్ర యాదవ్ మాట్లాడుతూ డా. మునస్వామి యాదవ్ మరణం యాదవ సమాజానికే కాకుండా సమాజ సేవను విశ్వసించే ప్రతి ఒక్కరికీ తీరని లోటని వెంకట రామచంద్ర యాదవ్ అన్నారు. పేదలు, నిరుపేదలు, ఆపదలో ఉన్నవారికి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా వైద్య సేవలు అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ సమానంగా చూసిన గొప్ప మానవతావాది అని కొనియాడారు. యాదవ భవన్ నిర్మాణం ఆయన కల అని, ఆ కలను సాకారం చేయడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని తెలిపారు. మునస్వామి గారి సేవా స్ఫూర్తి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. కట్ట జయరామ్ యాదవ్, ఉల్లిపాయల ముని మేఘనాథం, ఈతమాకుల హేమంత్ కుమార్ యాదవ్, చింతాబరణి యాదవ్, జల్లి తులసి యాదవ్ తదితరులు డా. మునస్వామి యాదవ్ సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డా. మునస్వామి యాదవ్ కుల, మత, జాతి భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ సేవలందించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. "మునస్వామి కాదు... మన స్వామి" అని పలువురు భావోద్వేగంతో నివాళులర్పించారు. ఆయన ఇంటి పేరు 'కారణి' అయినప్పటికీ, సమాజానికి కారణజన్ముడిగా నిలిచారని పేర్కొన్నారు. డా. మునస్వామి యాదవ్ ఆశయాలలో ఒకటైన యాదవ్ భవన్ నిర్మాణాన్ని పూర్తి చేయడం ద్వారా ఆయన ఆత్మకు శాంతి చేకూర్చే విధంగా అందరూ సహకరించాలని సభలో తీర్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, జిల్లా జడ్జి అన్వర్ భాష, మాజీ తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ గోపీకృష్ణ,గీతా గోవిందం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బాల గుర్రప్పయాదవ్ , చిత్తూరుకు చెందిన అశోక్ ఆనంద్ యాదవ్, ఒంగోలు నుంచి రాజ్యలక్ష్మి, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ పులిగోరు మురళీకృష్ణ రెడ్డి, అన్నా రామచంద్ర యాదవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దంపూర్ భాస్కర్ యాదవ్, బిడ్డల కృష్ణ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి అన్నా అనిత యాదవ్, వెంకట పుష్పావతి యాదవ్, సీపీఐ నాయకులు పెంచలయ్య, మురళి, అశోక్ సామ్రాట్ యాదవ్, బీసీ సంఘం ప్రతినిధి సురేష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ వాసుదేవా యాదవ్ సేవా సంఘం ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కాటమరాజు సంస్కృతి, చరిత్ర ను పరిరక్షిస్తాం

-కాటమరాజు సంస్కృతి పరిరక్షణ సమితి కార్యదర్శి బి. నాగన్న యాదవ్



**వెలుగోడు, జూన్ 8 (వార్తాప్రభ) :** వెలుగోడు మండలం గుంతకందాల గ్రామంలోని కాటమయ్య వనములో వెలిసిన కాటమరాజు విగ్రహాన్ని , వెలుగోడు రిజర్వాయర్ మద్రాసు కాల్వ ఒడ్డున గల కాటమరాజు విగ్రహాలను కాటమరాజు సంస్కృతి పరిరక్షణ సమితి కార్యదర్శి నాగన్న యాదవ్ , అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నాయకుడు రఘురాముడు యాదవ్ , గోపాల్ యాదవ్ , ఆదినారాయణ యాదవ్ , రమేష్ యాదవ్ ఆదివారం సందర్శించారు . వెలుగోడు రిజర్వాయర్ హెడ్ రెగ్యులేటర్ సమీపములో మద్రాసు కాల్వ ఒడ్డున ఉన్న కాటమరాజు విగ్రహం నకు యాదవ పెద్దలు పూజలు నిర్వహించి, టెంకాయ కొట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి నాగన్న మాట్లాడుతూ వెలుగోడు రిజర్వాయర్ మునక ప్రాంతంలో ఉన్న కాటమరాజు విగ్రహాన్ని తెలుగు గంగ అధికారులు రిజర్వాయర్ నిర్మాణ సమయంలో తీసుకువచ్చి మద్రాస్ కాల ఒడ్డున నిలబెట్టారు. అప్పటినుంచి వెలుగోడు కు చెందిన తలారి రాజ లింగయ్య యాదవ్ అరుగు నిర్మించి అరుగుపైన కాటమరాజు విగ్రహాన్ని ప్రతిష్ఠించడం జరిగిందని , అప్పట్నుంచి గ్రామస్తులు పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ విగ్రహానికి దేవాలయం లాగా నిర్మాణం చేపట్టడానికి అందరి సహకారంతో పూనుకుంటామని చెప్పారు. కాటమరాజు ఈ ప్రాంతంలో పరిపాలన చేసేటప్పుడు పశువులు మేపడం కోసం ఈ ప్రాంతమంతా పర్యటించి నందువల్ల, ఈ ప్రాంతంలో కాటమరాజు విగ్రహాలను నెలకొల్పడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న కాటమరాజు విగ్రహాలను దేవాలయాలను ఈ సమితి సభ్యులు సందర్శించి సంస్కృతిని , చరిత్రను పరిరక్షించడం జరుగుతుందని అన్నారు. అలాగే గుంతకందాల గ్రామములోని కాటమయ్య వనములో ఏకశిలా రాయిపై కాటమయ్య విగ్రహాన్ని చెక్కడం జరిగిందని , గతములో పూజలు అందుకున్న ఈ విగ్రహము కాలక్రమేనా శిదిలావస్థకు చేరుకొని పడిపోవడం వల్ల , తిరిగి దానిని నిలబెట్టి పూజలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమములో యాదవ సంఘం నాయకులు నాగేశ్వరరావు , చెన్నరాయుడు , ఎల్లయ్య , గుంతకందాలకు చెందిన యాదవ సంఘము నాయకులు సుబ్బరాయుడు , మాధవ స్వామి , నడిపి స్వామన్న, పెద్ద స్వామన్న ,గురుస్వామి , రాజేష్ , నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కనుకరించండి కరుణ చూపండి

-సూర్యుడు స్వచ్ఛంద సేవా సంస్థ పి జి ఆర్ ఎస్ వినతి



**విస్సన్నపేట,జూన్ 8 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో వందేళ్ళ చరిత్ర కలిగిన గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వీరేశలింగం హిందూ స్మశాన వాటికకు మౌలిక వసతులు కల్పించాలని సూర్యుడు స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్గనైజర్ సర్వేశ్వరరావు పీజీఆర్ఎస్ కార్యక్రమంలో విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలు లోకి వెళితే గత టిడిపి ప్రభుత్వ హయాంలో 10 లక్షల రూపాయలు మంజూరు కాగ నాలుగు లక్షల రూపాయలు పనులను నామినేషన్ వర్కుగా నాడు తెలుగు తమ్ముళ్ల మద్రిబోయిన వెంకటేశ్వరరావు (చిన్నోడు) గంజినబోయిన రమేష్ కొంగల శ్రీనివాసరావు పలగాని మాధవరావులు సంయుక్తంగా పనులు ప్రారంభించడం జరిగింది. నాలుగు లక్షల 50 వేల రూపాయల సొంత నిధులతో డ్రెస్సింగ్ రూమ్ దహన షెడ్డు కు సంబంధించి రూపు లెవెల్ వరకు కట్టుదిట్టమైన నిర్మాణం చేయడం జరిగింది. వారు పెట్టిన ఖర్చుకు 1,30,000 మాత్రమే నాటి కేంద్ర రాష్ట్ర అనుసంధాన ప్రభుత్వం నుండి ఉపాధి హామీ పథకం ద్వారా విడుదలయ్యాయి. నరేగా జిల్లా అధికారులు మిగిలిన సొమ్మును విడుదల చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. వర్క్ కోడ్ క్లోజ్ అయిందని రీఓపెన్ చేస్తామని చెప్పిన మాటలు కూడా త్రిశంకర్ స్వర్గంలో నిలిచిపోవడం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు. వర్షాలు విస్తృతంగా పడుతున్న ఈ సమయంలో శవ దహనానికి అడ్డంకులు లేకుండా దహన షెడ్డు రూపులేవులు కట్టడానికి రేకులు వేయించాలని లేనిపక్షంలో దాతల సహకారంతో మౌలిక వసతుల పనులు చేయించుకునేందుకు అనుమతి ఇవ్వాలని పత్రికా ముఖంగా కోరడం జరిగింది. ఎంపీడీవో చిన్న రాట్నాలు, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, విస్సన్నపేట గ్రామపంచాయతీ ఈవో హరికృష్ణ కుమార్ లకు మౌలిక వసతుల వినతి పత్రం అందించినట్లు చెప్పారు.

# గౌడ టెన్త్ మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు





**విస్సన్నపేట,జూన్ 8 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో నూజివీడు నియోజకవర్గం విస్సన్నపేట రెడ్డిగూడెం మండలాల గౌడ సామాజిక వర్గ టెన్త్ మెరిట్ విద్యార్థులకు ఘన సత్కార కార్యక్రమాలను గౌడ సామాజిక వర్గ పెద్దలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ మోటపోతుల కిషోర్ బాబు, నూజివీడు సీఐ నాగేంద్ర కుమార్, బీసీ సంక్షేమ సంఘం, రాష్ట్ర కార్యదర్శి మేక వెంకటేశ్వరరావు, కెనరా బ్యాంకు మేనేజర్ వేముల పుల్లారావు, అవిన్య హాస్పిటల్ ఎండీ డాక్టర్ కంటే సాగర్,గౌడ సంఘం యువ నాయకులు అనగాని చైతన్య,నూజివీడు నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షులు కందుల కృష్ణ, కార్యక్రమ నిర్వాహకులు పానుగంటి సత్యం సన్స్ సూరిబాబు, మహేష్,బోట్ల శివ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ కిషోర్ బాబు మాట్లాడుతూ గౌడ జాతి ముద్దు బిడ్డలుగా ,ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకొని మంచి స్థాయిలో ఉండాలి పిలుపునిచ్చారు. తదుపరి నూజివీడు సీఐ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు పిల్లలకు మంచి ఉత్సాహం కలిగిస్తాయని,ప్రతిఒక్క విద్యార్థిని, విద్యార్థులు జీవితంలో అత్యంత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలియజేశారు,మహేష్ మాట్లాడుతూ గౌడ సంఘం అభివృద్ధికి తన వంతు భరోసాగా ఈ కార్యక్రమం నిర్వహించటం జరిగిందని గౌడ కుల బాంధవులు ఎంత ఎత్తుకు ఎదిగిన తమకు అవకాశం ఉన్నంతలో సామాజిక వర్గానికి చెందిన వారికి ఎంతోకొంత మేలు చేయాలని అది ప్రత్యక్షంగా నైనా పరోక్షంగా నైనా పరవాలేదని ప్రతి ఒక్కరూ ఈ ఒక్క విషయం మరువరాదన్నారు. ఆదివారం సాయంత్రం జరిగిన గౌడ సామాజిక వర్గ ఆత్మీయ సమావేశంలో విస్సన్నపేట పట్టణం గౌడ సంఘ నాయకులు పలగాని మాధవరావు, పుల్లారావు, శ్యామ్, జగపతి,బయగని మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఎం పీ వల్లభనేని బాలశౌరి నీ సన్మానించిన బొమ్ములూరు గ్రామం నేతలు



**హనుమాన్ జంక్షన్,జూన్ 8 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామంనికి కమ్యూనిటీ హాల్ నిర్మాణ నిమిత్తం సుమారు 30 లక్షల నిధులను పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి విడుదల చేశారు. త్వరలో టెండర్లు పిలిచి నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగింది. గన్నవరం నియోజకవర్గం శాసన సభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్ సహకారం తో నియోజకవర్గ జనసేన ఇంచార్జి చలమశెట్టి రమేష్ ఆధ్వర్యం లో గ్రామం తరుపున కాటూరు విజయ్ భాస్కర్, యర్రంశెట్టి బాబీ, గండెపూడి నితీష్, గుల్లపూడి ప్రసాద్,గాలంకి అప్పారావు, పోలిమెట్ల వాసు ఎంపీ వల్లభనేని బాలశౌరి నీ ఆఫీసులో కలిసి కృతజ్ఞతలు తెలియజేసి ఘనంగా సన్మానించారు.

## పెడన నియోజకవర్గ బీసీ చైతన్య సమితి అధ్యక్షునిగా నూనె కళ్యాణ్



**పెడన,జూన్ 8 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం బంటుమిల్లికి చెందిన నూనె కళ్యాణ్ యాదవ్ బీసీ చైతన్య సమితి పెడన నియోజకవర్గ అధ్యక్షునిగా నూనె కళ్యాణ్ నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలో ఆదివారం నిర్వహించిన బీసీ చైతన్య సమితి రాష్ట్ర స్థాయి సమావేశంలో జాతీయ అధ్యక్షుడు బీసీ రమణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు... సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న నూనె కళ్యాణ్ ముఖ్యంగా యాదవ్ సేన ఆధ్వర్యంలో నిర్వహించే పలు సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ముందంజలో నిలుస్తున్నారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన బీసీ చైతన్య సమితి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీల అభ్యున్నతి సామాజిక న్యాయం యువత సాధికారత కోసం మరింత కృషి చేస్తానని చెప్పారు. నూనె కళ్యాణ్ నియామకం పట్ల పెడన నియోజకవర్గ యాదవుల ప్రతినిధి కొలుసు చందు యాదవ్ బీసీ ప్రముఖులు సామాజిక నాయకులు అభినందనలు తెలిపారు.

## మచిలీపట్నం నియోజకవర్గ బీసీ చైతన్య సమితి అధ్యక్షునిగా బోయిన నాగరాజు యాదవ్



**మచిలీపట్నం,జూన్ 8 (వార్తాప్రభ) :** బీసీ చైతన్య సమితి మచిలీపట్నం నియోజకవర్గ అధ్యక్షునిగా బోయిన నాగరాజు యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలో ఆదివారం నిర్వహించిన బీసీ చైతన్య సమితి రాష్ట్ర స్థాయి సమావేశంలో జాతీయ అధ్యక్షుడు బీసీ రమణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న నాగరాజు ముఖ్యంగా యాదవ్ సేన ఆధ్వర్యంలో నిర్వహించే పలు సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రస్తుతం మచిలీపట్నం పెడన నియోజకవర్గంలో యాదవ్ సేన కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన బీసీ చైతన్య సమితి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బోయిన.నాగరాజు నియామకం పట్ల పెడన నియోజకవర్గ యాదవసేన ప్రతినిధి కొలుసు చందు యాదవ్ బీసీ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## గుడివాడ మండల ఇన్చార్జ్ సర్వేయర్ గా జి.అనురూప్



**గుడివాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ ఉత్తర్వుల మేరకు డిస్టిక్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్ ఆదేశాల మేరకు రామనపూడి విలేజ్ సర్వేయర్ గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న జి.అనురూప్ కు అదనపు బాధ్యతగా గుడివాడ మండల ఇంచార్జ్ సర్వేయర్ నియమిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నూతన మండల ఇంచార్జి సర్వేయర్ అనురూప్ గుడివాడ ఎమ్మార్వో బి ఆర్ కే ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి బాధ్యతను స్వీకరించారు. ఈ సమావేశంలో గ్రామ సర్వేలందరూ పాల్గొనగా నూతన తాసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన బి ఆర్ కే ప్రసాద్ కు రెవిన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## టీడీపీ రాజ్యసభ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సౌమ్య



**నందిగామ,జూన్ 8 (వార్తాప్రభ) :** సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లను సోమవారం శాసనసభలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సత్కరించి అభినందనలు తెలిపారు. నామినేషన్ కార్యక్రమం సందర్భంగా నూతన రాజ్యసభ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే సౌమ్య పార్టీ అధినేత మరియు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో అనుభవం, సామర్థ్యం, పార్టీ పట్ల అంకితభావం కలిగిన నాయకులకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. రాజ్యసభ వేదికగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి అవసరాలు, ప్రజా సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఈ ముగ్గురు నాయకులు కీలక పాత్ర పోషిస్తారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాల బలోపేతంతో పాటు రాష్ట్రానికి మరిన్ని నిధులు, ప్రాజెక్టులు సాధించడంలో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. తెలుగుదేశం పార్టీ దేశ రాజకీయాల్లో మరింత బలమైన స్వరం వినిపించేలా నూతన రాజ్యసభ సభ్యులు తమ సేవలు అందించాలని కోరుతూ వారికి మరోసారి అభినందనలు తెలిపారు.

# సమన్వయంతోనే స్వచ్ఛ రామగుండం సాకారం!!

**ప్రజా పాలన వార్డు సభలో ప్రజా ప్రతినిధులు, అధికారుల పిలుపు**



**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 8 (వార్తాప్రభ ప్రతినిధి)** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులందరికీ చేరేలా కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో కదలాలని రామగుండం నగర డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఎన్టీపీసీ పీటీఎస్ కాకతీయ కల్యాణ మండపంలో 15 డివిజన్ల క్లస్టర్ స్థాయి 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' వార్డు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ, ఎమ్మెల్యే, మేయర్లతో కలిసి ప్రజా ప్రతినిధులు నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ నగర రూపురేఖలు మారుస్తున్నారని, వర్షాకాల విపత్తులను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఇదే సమయంలో, యువత సెల్‌ఫోన్ వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు పోలీసుల సూచనల మేరకు పిల్లలపై నిఘా ఉంచాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ జె. అరుణశ్రీ మాట్లాడుతూ, వర్షాకాల కార్యాచరణలో భాగంగా కాలువల పూడికతీత, రోడ్ల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీల అదుపు, వీధిదీపాల పునరుద్ధరణ వంటి చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమల నివారణకు పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటూ, 2016 నిబంధనల ప్రకారం చెత్తను నాలుగు రకాలుగా (తడి, పొడి, శానిటరీ, ఈ-వేస్ట్) వేరు చేసి మున్సిపాలిటీకి అందించాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 15 లోగా ఓటరు జాబితా మ్యాపింగ్ పూర్తి చేయాలని, భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు నిర్మించాలని, వనమహోత్సవం కోసం స్థలాల గుర్తింపు జరుగుతోందని ఆమె వివరించారు. ఈ సభలో ఏసీపీ మడత రమేష్ ట్రాఫిక్ నిబంధనలపై, ఎంఆర్వో రవీందర్ ఓటరు సర్వేపై, వైద్యాధికారి అతుల్య అంటువ్యాధుల అరికట్టడంపై, ఐసీడీఎస్ సీడీపీవో ఆలేఖ్య అంగన్‌వాడీ సేవలపై అవగాహన కల్పించగా, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి సహా పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న తాపీ మేస్త్రీల ఆత్మగౌరవ సభకు బయలుదేరిన భవన నిర్మాణ సంఘం నాయకులు, కార్మికులు



**జవహర్ నగర్, జూన్ 8:(వార్తా ప్రభ)**భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం గ్రేటర్ హైదరాబాద్ కమిటి ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న తాపీ మేస్త్రీల ఆత్మ గౌరవ సభకు జవహర్ నగర్ భవన నిర్మాణ సంఘం మరియు కాంట్రాక్టర్స్ కార్మికులు అధిక సంఖ్యలో బస్సులలో బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కొయ్యడా వెంకటేష్, అధ్యక్షులు చెన్నాపురం యాదయ్య, ప్రధాన కార్య దర్శి బూడిద వెంకటేష్, ఉపాధ్యక్షులు మరాఠి బాబు, ఏ ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు ఎర్రెల్లి మల్లేష్, కోశాధికారి కోట్ల చెన్నా రెడ్డి, సలహా దారులు రమణ రెడ్డి, కొయ్యడా ఐలయ్య, మాధవ్, సాదుల్ల, మధు, కుర్మ వెంకటేష్, యాదగిరి, మహేష్, శ్రీను, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు

# యుద్ధ కళా చిన్నారులకు ఫ్రూట్ జ్యూస్ పంపిణీ



**అమలాపురం జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అమలాపురం రవణం వీధిలోని శివాలయం వద్ద ఉన్న శ్రీ కోనసీమ యుద్ధ కళా కేంద్రం వేదికగా మారింది.వేసవి తాపాన్ని జయించేలాభగభగ మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా,మన ప్రాచీన యుద్ధ కళలను ఎంతో నిష్ఠతో అభ్యసిస్తున్న చిన్నారుల పట్ల నల్లా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ నల్లా పవన్ అమితమైన అభిమానం కనబరిచారు.కఠోర సాధనలో ఉన్న పిల్లలు సాధన వీక్షించడానికి నల్లా పవన్ స్వయంగా శిబిరానికి విచ్చేశారు. తన చేతుల మీదుగా పిల్లలందరికీ వేసవి తాపాన్ని తీర్చే చల్లని ఫ్రూట్ జ్యూస్ అందజేసి వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపారు.యుద్ధ కళలను నేర్పుతున్న గురువు వంటెద్దు సత్తిబాబుని నల్లా పవన్ అభినందించారు.ఇలా స్వయంగా వచ్చి పానీయాలు అందించడం పట్ల పిల్లలు ఎంతో సంతోషించారు.రేపటి పౌరులైన చిన్నారుల పట్ల ఆయన చూపిన ఈ వాత్సల్యానికి శిబిరం నిర్వాహకులు, పిల్లల తల్లిదండ్రులు, పట్టణ ప్రజలు విశేషంగా హర్షం వ్యక్తం చేశారు.చిన్నారుల అవసరాన్ని గుర్తించి వారికి చల్లని పానీయంతో సాంత్వన చేకూర్చిన నల్లా పవన్ కి 'శ్రీ కోనసీమ యుద్ధ కళా కేంద్రం' యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



కాప్రా మండల నూతన తహసీల్దార్ ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ నాయుడు, ప్రవీణ్, రామ్ రెడ్డి, సోమయ్య పాల్గొని పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.
కాప్రా, జూన్ 8:(వార్తా ప్రభ)

# సింగరేణి బొగ్గు సెగ!!

● యాజమాన్యం వివరణ ● కేటీఆర్ స్కామ్ ఆరోపణలు



పెద్దపల్లి/గోదావరిఖని, జూన్ 8 :సింగరేణి సంస్థను చుట్టుముట్టిన బొగ్గు నిల్వల వివాదం ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. యాజమాన్యం వెల్లడించిన లెక్కలు, వాటిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణల సంక్షిప్త కథనం ( విజన్ ఆంధ్ర )దక్షిణాది విద్యుత్ రంగానికి వెన్నుముకైన సింగరేణిలో బొగ్గు నిల్వలు పడిపోవడంపై తీవ్ర రాజకీయ దుమారం రేగుతోంది. ఒకవైపు రికార్డు స్థాయిలో నిల్వలు తగ్గాయని యాజమాన్యం చెబుతుంటే, ఇది రూ. 1,600 కోట్ల భారీ కుంభకోణమని ప్రతిపక్షం బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.

**యాజమాన్యం వాయిస్: "పదేళ్లలో అత్యల్ప నిల్వలు"**
సింగరేణి అధికారిక ప్రకటన ప్రకారం జూన్ 4 నాటికి గనుల వద్ద కేవలం 26.51 లక్షల టన్నుల బొగ్గు మాత్రమే ఉంది.

**సగానికి పడిపోయిన స్టాక్:** గత పదేళ్లలో (2014-24) సగటున 50 లక్షల టన్నుల నిల్వలు ఉండేవి. వర్షాకాలంలో థర్మల్ కేంద్రాలకు నిరాటంకంగా సరఫరా చేయడానికి కనీసం 30 లక్షల టన్నులు ఉండాలి. ప్రస్తుతం నిల్వలు తగ్గడంతో రవాణాను క్రమబద్ధీకరిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

**టెండర్ల నిబంధనలపై స్పష్టత:**ఓబీ పనుల మధ్యలో కాంట్రాక్టర్లు వదిలేయకుండా ఉండటానికే మే 2025 నుండి 'సైట్ విజిట్ సర్టిఫికేట్' తెచ్చామని, దీనివల్ల ఇప్పుడు పనులు సజావుగా సాగుతున్నాయని స్పష్టం చేసింది.

అక్రమాలపై విచారణ: మెడికల్ బోర్డు దళారులపై యాజమాన్యమే స్వయంగా ఏసీబీకి ఫిర్యాదు చేసిందని, ఇద్దరు ఉద్యోగులను అరెస్ట్ కూడా చేశారని విజిలెన్స్ విభాగం తెలిపింది.

**కేటీఆర్ వాయిస్:** 40 లక్షల టన్నుల బొగ్గు మాయం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాసిన ఘాటైన లేఖలో ఇది పెద్ద కుంభకోణమని ఆరోపించారు. రికార్డుల్లో ఉంది..




క్షేత్రస్థాయిలో లేదు: వెబ్‌సైట్ రికార్డుల్లో రామగుండం (10 లక్షల టన్నులు), శ్రీరాంపూర్ (8 లక్షలు), మందమర్రి (7.20 లక్షలు) సహా మొత్తం ఏడు గనుల వద్ద బొగ్గు ఉన్నట్లు చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో బొగ్గు మాయమైందని విమర్శించారు.

**వరుస అక్రమాల చిట్టా:** నచ్చిన వారికి నైని కోల్ బ్లాక్ టెండర్లు కట్టబెట్టేందుకే 'సైట్ విజిట్' నిబంధన తెచ్చారని, సోలార్ టెండర్లు అధిక ధరలకు ఇచ్చారని మండిపడ్డారు. ఐఓసీఎల్ నుండి నేరుగా డీజిల్ కొనడం ఆపేసి, 30% ఎక్కువ ధరతో పేలుడు పదార్థాలు కొంటున్నారని, ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం రూ. 110 కోట్ల సింగరేణి నిధులు వృథా చేశారని ఆరోపించారు.

**డిమాండ్:**ఈ రూ. 1,600 కోట్ల స్కామ్‌పై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, వాస్తవాలు తేల్చేందుకు గనుల వద్దకు అఖిల పక్షాన్ని పంపాలని డిమాండ్ చేశారు.ఈ బొగ్గు నిల్వల క్షీణత వెనుక నిజంగానే యాజమాన్యం చెబుతున్న సాంకేతిక కారణాలు ఉన్నాయా? లేక ప్రతిపక్షం ఆరోపిస్తున్నట్లు భారీ అవినీతి జరిగిందా? కేంద్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? అనే ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే!!

**గడ్డం సంతోష్ రాజ్**
వార్తాప్రభ ప్రతినిధి

# టీఆర్ఎస్ జెండా పండుగలో సింహగర్జన!!

● ఉచిత విద్య, ఉచిత వైద్యమే లక్ష్యం ● కవిత ఆశయాలకు ప్రజల మద్దతు ● ప్రతి ఇంటికి టీఆర్ఎస్ సిద్ధాంతాలు ● కవిత నాయకత్వాన్ని బలపరచాలి ● తెలంగాణ రక్షణ సేన నాయకురాలు మనోజ్ గౌడ్ పిలుపు

**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 8 (వార్తాప్రభ ప్రతినిధి)** గోదావరిఖని గంగానగర్ ప్రాంతంలో తెలంగాణ రక్షణ సేన (టి.ఆర్.ఎస్.) జెండా పండుగ వేడుకలు జిల్లా ఇంచార్జ్ సారథ్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మహిళా నాయకురాలు, నియోజకవర్గ అబ్జర్వర్ పడాల మనోజ గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించి, సభనుద్దేశించి తనదైన శైలిలో సింహగర్జన చేశారు. ఈ సందర్భంగా మనోజ గౌడ్ మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా, 'ఉచిత విద్య - ఉచిత వైద్యం' అనే విప్లవాత్మక ఆశయాలతో ప్రజా క్షేత్రంలోకి వస్తున్న కల్వకుంట్ల కవిత నాయకత్వాన్ని అందరూ బలపరచాలి అని పిలుపునిచ్చారు. కవిత ఆలోచనల శైలికి, ప్రజా సంక్షేమ పంథాకు క్షేత్రస్థాయిలో ప్రజల నుండి బ్రహ్మరథం పడుతున్నారని, రాబోయే రోజుల్లో టి.ఆర్.ఎస్. పార్టీని ప్రతి ఇంటా చేర్చి మరింత బలోపేతం చేయాలని ఆమె కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. రాబోయే రోజుల్లో పార్టీ సిద్ధాంతాలను, ప్రజాపక్ష విధానాలను ప్రతి ఇంటా ప్రచారం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ ప్రతిష్టాత్మక వేడుకల్లో




మాజీ మంత్రి బోడ జనార్ధన్, జె.బి.సి.సి.ఐ సభ్యులు రియాజ్ అహ్మద్, జిల్లా ఇంచార్జ్ కొమరయ్య, నియోజకవర్గ ఇంచార్జ్ సదానందం, పెద్దపల్లి ఇంచార్జ్ హారిక రావు, హెచ్.ఎమ్.ఎస్ వైస్ ప్రెసిడెంట్ ఆరెల్లి పోచం, బాకి నాగరాజు,దుర్గం లక్ష్మణ్ ముందుండి నడిపించారు. మనోజ ప్రసంగానికి జేజేలు పలుకుతూ కార్యక్రమాన్ని పాల్గొన్న మిగతా కార్యకర్తలు విజయవంతం చేశారు.

# చంద్ర రాజేశ్వరరావు ఆదర్శాలు నేటి తరానికి మార్గదర్శకం

● "ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత, వామపక్ష శక్తులు ఐక్యంగా ముందుకు రావాలి:
● తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి



**హైదరాబాద్,జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దేశంలో పెరుగుతున్న అసంతృప్తి, రాజకీయ వ్యవస్థపై ప్రజల్లో నెలకొంటున్న నిరాశను అధిగమించాలంటే కమ్యూనిస్టు, సెక్యులర్, సోషలిస్టు శక్తులు ప్రజలకు విశ్వసనీయ ప్రత్యామ్నాయంగా ఎదగాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టు ఉద్యమ స్ఫూర్తిని నేటి తరానికి చేరవేయడంతో పాటు యువతను ఆకర్షించే పద్ధతుల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని సూచించారు. అప్పుడే కమ్యూనిస్టు ఉద్యమ దిగ్గజం చంద్ర రాజేశ్వరరావు బాటలో పయణించినా వారమవుతామని పేర్కొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ దిగ్గజం చంద్ర రాజేశ్వరరావు 112 వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సి.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో "బొద్దింకల అవిర్భావం - యువత - నెటిజెన్స్ ఎటువైపు" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సిఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా కె.శ్రీనివాసరెడ్డి, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి పి.జె.చంద్రశేఖరరావు, కోశాధికారి వి. చెన్నకేశవరావు, సిఆర్ ఫౌండేషన్ డెయాగ్నస్టిక్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రంజని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ కల్పనలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భారత వామపక్ష రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడు చంద్ర రాజేశ్వరరావు వ్యక్తిగత జీవితం, రాజకీయ జీవితం, ప్రజాసేవలో ఆదర్శప్రాయుడని తెలంగాణ కొనియాడారు. సిఆర్ కేవలం కమ్యూనిస్టు నాయకుడే కాకుండా రాజకీయ నైతికతకు, నిరాడంబర జీవనానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. దేశ రాజకీయ చరిత్రలో కీలక పాత్ర పోషించిన నాయకుడి అనుభవాలు సంపూర్ణంగా పుస్తకరూపంలో అందుబాటులోకి రాకపోవడం ఒక లోటుగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ నారాయణ మాట్లాడుతూ దేశ సమైక్యతకు ఎనలేని కృషి చేసిన మహానేత చంద్ర రాజేశ్వరరావు అని కొనియాడారు.దేశంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభం తాత్కాలికం కాదని, యువతలో పెరుగుతున్న అసంతృప్తి, రాజ్యాంగబద్ధ సంస్థలపై నమ్మకం క్షీణించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతాలని హెచ్చరించారు. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల్లో కూడా ఇదే తరహా ప్రజా అసంతృప్తి కనిపించిందని వివరించారు.యువతలో పేరుకుపోతున్న అసంతృపిని ప్రభుత్వం అర్థం చేసుకుని పరిష్కరించకపోతే అది దేశ రాజకీయ, సామాజిక పరిస్థితులను గణనీయంగా ప్రభావితం చేయగలదన్నారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు జీవితం ఉద్యమ కార్యకర్తలకు ఆదర్శమని, ఆయన చూపిన మార్గంలో నడవడమే నిజమైన నివాళి అని అన్నారు. సిఆర్ తన 80 ఏళ్ల జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేశారని గుర్తుచేశారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ త్యాగాలు తనపై ప్రభావం చూపాయని సిఆర్ చెప్పేవారని తెలిపారు. ప్రజాతంత్ర, వామపక్ష శక్తుల ఐక్యత ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని ఆయన విశ్వసించారని పేర్కొన్నారు. ఈసందర్భంగా గత23 ఏళ్లుగా సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమం లో నివాసం ఉంటున్న ప్రొఫెసర్ వేణు గోపాల్, డాక్టర్ రంగనాయకి 70వ వివాహ వార్షికోత్సం సందర్భంగా ఘనంగా సన్మానించారు.

**యువతలోని అసహనం- అసంతృప్తిని కమ్యూనిస్టులు అందిపుచ్చుకోవాలి**
చంద్ర రాజేశ్వరరావు జయంతి సందర్భంగా బొద్దింకల అవిర్భావం- యువత- నెటిజన్స్ ఎటువైపు అనే అంశంపై శ్రీనివాస్‌రెడ్డి కీలకోపాన్యాసం చేశారు. ఓ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోచనతో లేక అనాలోచనాతోనో బొద్దింకలు అనే పదాన్ని ఉపయోగించిన నేపథ్యంలో దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడమేకాకుండా సోషల్ మీడియా వేదికగా కక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటు చేయడం, ఆ వెంటనే 2.20 కోట్ల మంది సభ్యులు దానికి మద్దతు పలకడం దేశ యువతలో నెలకొన్న అసంతృప్తికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 6వ తేదీన కాక్రోచ్ జనత పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో నీట్ పరీక్ష ప్రశ్నా పత్రం లీకేజి, సిబిఎస్ఈ ఘటలపై యువత పెద్ద ఎత్తున నిరసన తెలిపిన విషయం తెలిసిందేన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం ముందు వారు ప్రధానంగా 5 డిమాండ్లపై ప్రభుత్వ ముందు పెట్టారన్నారు. అందులో ఒక పార్టీ గుర్తుపై ఎన్నికై తర్వాత మరో పార్టీలో చేరే ప్రజాప్రతినిధులను 20 ఏళ్ల పాటు పోటీకి అనర్హులు ప్రకటించాలనిఆదేవిధంగాఈ దేశంలోని 18 ఏళ్ల నిండిన ప్రతి పౌరుడికి ఓటు కల్పించాలని దానిని ఎన్నికల కమిషన్ తొలగిస్తే కమిషనర్లపై ఉపా చట్టం కింద కేసులు నమోదు చేసేలా ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడంతో పాటు ఓటర్ల జాబితాల నిర్వహణలో పారదర్శకత పెంచాలని సూచించారన్నారు.మీడియా సంస్థలు ప్రజాస్వామ్య విలువలను కాపాడే బాధ్యతను మరవకూడదని, ప్రజల సమస్యలను ప్రతిబింబించే స్వతంత్ర మీడియాకు మాత్రమే అనుమతించాలని కార్పొరేట్ మీడియా సంస్థలను నిషేదించాలని డిమాండ్ చేశారన్నారు.ఈ నేపథ్యంలో దేశంలో పెరుగుతున్న సామాజిక, ఆర్థిక అసమానతల నేపథ్యంలో కమ్యూనిస్టు, సెక్యులర్, సోషలిస్టు శక్తుల మనుగడ అత్యంత కీలకమన్నారు.యువతను ఆకర్షించడంలో కమ్యూనిస్టు పార్టీలు కొత్త వ్యూహాలను అవలంబించాల్సిన అవసరం ఉందని, 50 ఏళ్ల క్రితం పనిచేసిన పద్ధతులు నేటి తరానికి సరిపోవని, వారి భాషలోనే మాట్లాడుతూ ఆధునిక మాధ్యమాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల్లో విశ్వాసాన్ని కలిగించే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగితేనే దేశ భవిష్యత్తుకు భరోసా ఉంటుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సన్మానిత వృద్ధాశ్రమ దంపతులు ప్రొఫెసర్ వేణుగోపాల్- డాక్టర్ రంగనాయకి దంపతులు సీ ఆర్ ఫౌండేషన్ కు లక్ష రూపాయలు విరాళం అందజేశారు. వారు ప్రసంగిస్తూ సి ఆర్ ఫౌండేషన్ ఆశ్రమంలో ఉన్నందువల్లనే తాము ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంటున్నామని కృతజ్ఞతలు తెలియజేశారు.

# హైదరాబాద్

## ప్రతి పౌరుడు పర్యావరణహిత చర్యలు చేపట్టాలి

● ఆచార్యులు పి శ్రీనివాస్.





**శేరిలింగంపల్లి,జూన్ 8 (వార్తాప్రభ):**మహాసముద్రాలను కాపాడటం అంటే మానవాళి భవిష్యత్తును రక్షించడమేనని హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ఎర్త్, ఓషన్ అండ్ ఎట్మాస్ఫియర్ సైన్సెస్ విభాగం ఆచార్యులు పి. శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మహాసముద్ర దినోత్సవం సందర్భంగా సోమవారం తారానగర్‌లోని విద్యానికేతన్ మోడల్ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆచార్యులు పి. శ్రీనివాస్ మాట్లాడుతూ భూమి ఉపరితలంలో 71 శాతం భాగాన్ని జలాలు ఆక్రమించి ఉన్నాయని, వాతావరణ సమతుల్యత,జీవవైవిధ్య పరిరక్షణ, మానవ జీవితానికి అవసరమైన వనరుల అందుబాటులో మహాసముద్రాల పాత్ర కీలకమని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా పీల్చే ఆక్సిజన్‌లో గణనీయమైన భాగం సముద్రాల నుంచే లభిస్తుందని పేర్కొన్నారు.ప్లాస్టిక్ వ్యర్థాలు,పారిశ్రామిక రసాయనాలు, చమురు లీకేజీలు,మురుగునీరు తదితరాల వల్ల సముద్రాలు తీవ్ర కాలుష్యానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.సముద్ర జీవ వ్యవస్థ దెబ్బతింటే దాని ప్రభావం మానవ జీవనంపైనా పడుతుందని చెప్పారు.సముద్రాల పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా పర్యావరణ హిత చర్యలు చేపట్టాలని సూచించారు.ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ రామాచారి అధ్యక్షత వహించారు.ప్రిన్సిపాల్ కనకదుర్గ, ఉపాధ్యాయులు, విద్యార్థులు,అసోసియేషన్ సభ్యుడు అమ్మయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## షేక్ మస్తాన్ బి ని పరామర్శించిన సిపిఐ నాయకులు



**జవహర్ నగర్, జూన్ 8:(వార్తా ప్రభ)**సోమవారము ఉమ్మడి రంగారెడ్డి జిల్లామహిళా సమైక్య మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ బి మరియు సిపిఐమాజీ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ మస్తాన్ బి ని పరామర్శించినారు గత కొంతకాలంగా మోకాలు నొప్పితో బాధపడుతూ ఇటీవలే నిమ్స్ హాస్పిటల్ లో మోచిప్ప ఆపరేషన్ చేయించుకొని తన నివాసములో బెడ్ రెస్ట్ తీసుకుంటున్న మస్తాన్ బి ని 8/6/2026నాడు. సిపిఐ నాయకులు తెలిసిన వెంటనే పరామర్శించడం జరిగింది. సిపిఐ నాయకులు మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ సిపిఐ కాప్రామండల కార్యదర్శి దర్శనం యాదగిరి ఏఐటిసి మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, సిపిఐ మాజీ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ మీరా, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ సాధనాల వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలి -సీడీపివో పుష్పలత

**ఏఐ సాధనాల వినియోగంపై అంగన్వాడీ టీచర్లకు ఒక్కరోజు శిక్షణ**




**మైలవరం జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రస్తుత కంప్యూటర్ కాలంలో డిజిటల్ సాధనాల వినియోగంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని ఐసిడిఎస్ మైలవరం ప్రాజెక్టు సీడీపివో కె.పుష్పలత పేర్కొన్నారు. మైలవరం ఐసిడిఎస్ మైలవరం ప్రాజెక్టు పరిధిలో ని వివిధ గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలలో పని చేస్తున్న అంగన్వాడీ టీచర్లకు మైలవరం పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏఐ ఎనేబుల్డ్ ఇసిడి స్క్రీనింగ్ 0-6 సంవత్సరాల పిల్లల గురించి సోమవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమా న్ని నిర్వహించారు.నవచేతన పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమానికి సీడీపివో పుష్పలత హాజరయ్యారు.ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ చిన్నారుల శారీరక, జ్ఞాన సంబంధిత అభివృద్ధి, భాషా సామాజిక, భావద్వేగాల అభివృద్ధి,స్వయం సహాయక నైపుణ్యాలను సాంకేతిక విధానాల ద్వారా అంచనా వేసేందుకు వీలుంటుందని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎ.శ్రీలక్ష్మి, డి. జోజి కటాక్షం మాట్లాడుతూ నవచేతన యాప్ గురించి అంగన కార్యకర్తలకు అవగాహన కల్పించారు. డా. ప్రియాంక మైల్ స్టోన్స్, పిల్లల ఎదుగుదల, ఆటిజా గురించి క్షుణ్ణంగా వివరించారు.

# సంపాదకీయం

## జనసేనలో ఆపరేషన్ క్లీన్.. క్రమశిక్షణపై పవన్ ఫోకస్

ఏపీలో అధికార కూటమి ప్రభుత్వంలో కీలకమైన భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీలో ఇప్పుడు సంచలన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించి, ఉపముఖ్యమంత్రిగా ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో బిజీగా ఉన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చాలా కాలం తర్వాత తన సొంత పార్టీని చక్కదిద్దుకునే పనిని ప్రారంభించారు. పార్టీని పూర్తిగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించిన పవన్ కొద్దిరోజులుగా ఆ అంశంపై సీరియస్ గా ఫోకస్ చేశారని అంటున్నారు. పార్టీ కార్యక్రమాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నవారితోపాటు గ్రూపు రాజకీయాలకు పాల్పడే నేతలకు పవన్ క్లాస్ పీకుతున్నారు. ఇదే లాస్ట్ ఛాన్స్ అనే హెచ్చరికలు పంపుతున్నట్లు చెబుతున్నారు.రెండు జిల్లాల కమిటీలు రద్దు గత కొద్ది రోజులుగా జనసేన పార్టీ క్షేత్రస్థాయి సమస్యపై పవన్ కళ్యాణ్ ఫోకస్ చేశారని టాక్ వినిపిస్తోంది. ప్రభుత్వ బాధ్యతలతోపాటు పార్టీ సంస్థాగత నిర్మాణం దెబ్బతినకుండా ఉండేందుకు ఆయన గట్టి నిర్ణయాలు తీసుకుంటున్నారని అంటున్నారు. ఇందులో భాగంగానే రెండు ఉమ్మడి ఒంగోలు, ప్రకాశం జిల్లాల కమిటీలను పూర్తిగా రద్దు చేసినట్లు చెబుతున్నారు. ఆ రెండు జిల్లాల్లో పార్టీ నేతల తీరుపై తీవ్ర అసంతృప్తిగా ఉన్న అధినేత పవన్ చాలా కాలం నుంచి చక్కదిద్దుకోవాలని సుతిమెత్తగా చెబుతున్నా, వినిపించుకోకపోవడంతో పార్టీ పదవుల నుంచి తప్పించినట్లు చెబుతున్నారు. ఆదివారం ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు పవన్ కళ్యాణ్ చేసిన ప్రకటన పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు. కేవలం జిల్లా కమిటీనే కాకుండా, ఆ జిల్లా పరిధిలో నగర, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి కమిటీలన్నింటినీ సమూలంగా రద్దు చేస్తూ అధినేత పవన్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నేతల్లో క్రమశిక్షణా రాహిత్యం పెరిగిపోవడం, పార్టీ విధివిధానాలకు భిన్నంగా కొందరు నేతల వైఖరి ఉండటమే దీనికి ప్రధాన కారణమని పార్టీ కేంద్ర కార్యాలయం స్పష్టం చేసింది. నేతల ప్రవర్తన వల్ల క్షేత్రస్థాయిలో కష్టపడే జన సైనికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదులు రావడంతో పవన్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. ప్రకాశం జిల్లా కమిటీపై ముందే యాక్షన్ ఇక నెల్లూరు కంటే ముందే గత నెలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీపై కూడా పవన్ కళ్యాణ్ ఇలాంటి కఠిన నిర్ణయమే తీసుకున్నారని గుర్తు చేస్తున్నారు. ఒంగోలు డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ అధ్యక్షుడిగా ఉన్న ప్రకాశం జిల్లా కమిటీలో అంతర్గత విభేదాలు, నేతల మధ్య సమన్వయ లోపం తీవ్రస్థాయికి చేరడంతో ఆ కమిటీని కూడా రద్దు చేశారని అంటున్నారు. కమిటీలో 28 మంది ఉంటే 56 గొడవలు పడుతున్నారంటూ పవన్ కళ్యాణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కమిటీలు రద్దయిన నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కొత్త కార్యవర్గాలను నియమించేంత వరకు పార్టీ వ్యవహారాల పర్యవేక్షణ బాధ్యతలను మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయమే నేరుగా చూసుకోనుందని చెబుతున్నారు. సమర్థులైన నేతలకు బాధ్యతలు అప్పగించే వరకు ఆయా జిల్లాల్లో పార్టీ వ్యవహారాలను నేరుగా పార్టీ కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షిస్తారని స్పష్టం చేశారు. దీనివల్ల గ్రూపు రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టే అవకాశం ఉంటుందని పవన్ భావిస్తున్నారని అంటున్నారు. కొంతకాలం నేతల తీరును పరిశీలించిన తర్వాత అందరినీ కలుపుకుని వెళ్లే నాయకులకు బాధ్యతలు అప్పగిస్తారని చెబుతున్నారు. పవన్ మార్క్ పాలిటిక్స్ సాధారణంగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ రాజకీయ పార్టీ అయినా అంతర్గత గొడవలను పెద్దగా పట్టించుకోదు. కానీ పవన్ కళ్యాణ్ భిన్నమైన శైలిని ప్రదర్శిస్తున్నారని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తనను నమ్మి ఓట్లేసిన ప్రజలకు జవాబుదారీగా ఉండటంతో పాటు, పార్టీలో క్రమశిక్షణే పరమావధి అని ఆయన సంకేతాలిస్తున్నారని చెబుతున్నారు. అధికార ఉందని ఇష్టానుసారం పనిచేస్తే సొంత పార్టీ వారినైనా క్షమించేది లేదని ఈ నిర్ణయాల ద్వారా పవన్ కళ్యాణ్ హెచ్చరిస్తున్నారని అంటున్నారు. ఈ 'రిపేర్లు' త్వరలోనే మరికొన్ని జిల్లాలకు కూడా విస్తరించే అవకాశం ఉందనే చర్చ జనసేనలో హాట్ పెంచేస్తోందని అంటున్నారు.

## రాష్ట్రంలో ముఖ్య దేవాలయాల్లో వేదపారాయణ పోస్టులు,మరికొన్ని పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

**విజయవాడ పశ్చిమ జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రం లోని ముఖ్య దేవాలయాల్లో ఖాళీగా ఉన్న వేదపారాయణదారులు,అర్చకులు, పరిచారకులు, భజంత్రీలు, వంట స్వాములు తదితర ధార్మిక పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి, అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి, పరిశీలన అనంతరం హాల్ టిక్కెట్లు జారీ చేసి మొదటగా వేదపారాయణదారులుకు పరీక్ష నిర్వహిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ అన్నారు.వేదపారాయణదారుల పోస్ట్ లకు సంబందించిన మౌఖిక పరీక్షలు సోమవారం నుండి ప్రారంభం అవుతున్న సందర్భంగా సోమవారం ఉదయం విజయవాడ మాడపాటి అతిథి గృహంలో దేవదాయ కమిషనర్ మీడియాతో మాట్లాడారు.ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వారు ఇటీవల దేవాదాయ శాఖపై సమీక్ష నిర్వహించిన సందర్భంలో రాష్ట్రంలో అన్ని ఆలయాలలో ఖాళీగా ఉన్న వైదిక సిబ్బంది పోస్టులు అన్నీ భర్తీ చేయవలసిందిగా ప్రత్యేకంగా ఆదేశించారని, సదరు ఆదేశాల ప్రకారం వైదిక సిబ్బంది ఖాళీలు ఏవైతే ఉన్నాయో వివరాలు అన్ని సేకరించి,భర్తీకి ప్రత్యేకంగా ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించగా, ప్రభుత్వం సెంట్రలైజెడ్ పరీక్ష నిర్వహించి, పూర్తి పారదర్శకత్వంతో ప్రతిభకే పట్టం కట్టే విధంగా నియామకాలు జరుపాలని ఆదేశించిందని రామచంద్ర మోహన్ పేర్కొన్నారు.342 ధార్మిక పోస్టులకు గానూ రాష్ట్రవ్యాప్తంగా 5వేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని,శ్రీకాకుళం నుండి కృష్ణా జిల్లా గల మల్టీజోన్-1 వేదపారాయణదారుల అభ్యర్థులకు విజయవాడ మాడపాటి అతిథి గృహంలో వేరే జోన్ కు చెందిన పండితులు అర్హత పరీక్ష జరుపుతుండగా, వేరే జోన్ కు చెందిన ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షణ చేస్తున్నారని,గుంటూరు నుండి రాయలసీమ వరకు గల మల్టీ జోన్ -2 అభ్యర్థులకు ఇదే విధంగా సీతానగరంలో పూర్తి పారదర్శకంగా ఈనెల 16 వరకు మౌఖిక పరీక్షలు జరుగుతాయని రామచంద్ర మోహన్ వివరించారు.ఈ మౌఖిక పరీక్షల్లో పారదర్శకత వహించి, ప్రతిభావంతులకే పట్టం కట్టెందుకు పరీక్షల నిర్వహణ అంతా వీడియో లైవ్ రికార్డింగ్ చేస్తున్నామని,వేదపారాయణదారు పోస్టుల భర్తీలో విద్యార్హతలు, వేదార్హతలు, అనుభవం, మౌఖిక పరీక్షలలో ప్రదర్శించిన ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయించి, మెరిట్ జాబితా రూపకల్పన జరుగుతుందని, మూడు ఇంటర్వ్యూ బోర్డులు ఏర్పాటు చేసామని, ఏ అభ్యర్థి ఏ ఇంటర్వ్యూ బోర్డుకు వెళ్తారో ఆఖరు నిమిషం వరకు అభ్యర్థికి తెలియదని కమిషనర్ వెల్లడించారు. వేదపారాయణదారు పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన అనంతరం అర్చకులు, పరిచారకులు, భజంత్రీలు తదితర పోస్టుల భర్తీని దశలవారీగా పూర్తి చేస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ పేర్కొన్నారు.



## నారా లోకేష్ విజన్‌తో ఏపీకి పారిశ్రామిక పునర్వైభవం!- ఎంపీ చిన్ని

- "లోకేష్ చొరవతో ప్రపంచ దిగ్గజాల చూపు ఆంధ్రప్రదేశ్ వైపు!"
- "రాయల్ ఎన్‌ఫీల్డ్ రాకకు కారణం పెట్టుబడిదారులకు కల్పించిన విశ్వాస వాతావరణం!"
- "యువతకు ఉద్యోగాలు... రాష్టానికి పెట్టుబడులు... లోకేష్ నాయకత్వంలో ఏపీకి కొత్త దిశ!"
- విజయవాడ భవానిపురం లోని రాయల్ ఎన్ఫీల్డ్ షోరూమ్ ను సందర్శించిన ఎంపీ చిన్ని



**విజయవాడ పశ్చిమ జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని భవానీపురంలో గల రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సందర్శించారు. ఈ సందర్భంగా షోరూమ్ ఎండీ తేజ ఎంపీకి ఘన స్వాగతం పలికి, సంస్థ కార్యకలాపాలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలు, రాష్ట్రంలో ఉన్న పెట్టుబడి అవకాశాలపై వివరించారు. షోరూమ్‌లోని అత్యాధునిక సదుపాయాలు, వినియోగదారులకు అందిస్తున్న సేవలను ఎంపీ కేశినేని చిన్ని పరిశీలించి అభినందించారు.అనంతరం ఎంపీ చిన్ని మాట్లాడుతూ, ప్రపంచ ప్రఖ్యాత రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడం రాష్ట్రంలో నెలకొన్న సానుకూల పారిశ్రామిక వాతావరణానికి నిదర్శనమన్నారు. ఈ విశ్వాసాన్ని నెలకొల్పడంలో మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.పారిశ్రామిక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన లోకేష్, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు, వేగవంతమైన అనుమతులు, పారదర్శక పరిపాలన, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా తీర్చిదిద్దారని అన్నారు.గతంలో పరిశ్రమలు ఇతర రాష్ట్రాల వైపు వెళ్లిన పరిస్థితుల నుంచి నేడు ప్రపంచ స్థాయి కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌ను ఆశాజనక పెట్టుబడి కేంద్రంగా గుర్తించడం రాష్టానికి గర్వకారణమని ఎంపీ తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి సంస్థల రాకతో యువతకు ఉపాధి అవకాశాలు



పెరగడంతో పాటు అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు."రాయల్ ఎన్‌ఫీల్డ్ ఏపీలోకి రావడం కేవలం ఒక సంస్థ రాక మాత్రమే కాదనీ,అది నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌పై పెరుగుతున్న పెట్టుబడిదారుల విశ్వాసానికి ప్రతీక అని మంత్రి లోకేష్ కృషిని కొనియాడారు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయనీ, ఉద్యోగాలు వస్తే యువత భవిష్యత్తు బలపడుతుందని రాష్ట్ర అభివృద్ధికి ఇది శుభసూచకం" అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. రాయల్ ఎంఫిల్డ్ షోరూమ్ సిబ్బంది తో ఎంపీ సెల్ఫీ వీడియో తీసుకున్నారు. అనంతరం సిబ్బంది తో ముచ్చటించారు . ఈ కార్యక్రమంలో షోరూమ్ ప్రతినిధులు, వ్యాపార వర్గాల ప్రముఖులు, పార్టీ నాయకులు పరుచూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై శాఖాధిపతులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ పశ్చిమ జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు.ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కమిషనర్, గతంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని శాఖాధిపతులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు.మున్సిపల్ సేవల కోసం రూపొందించిన "పురమిత్ర" యాప్‌లో నమోదవుతున్న ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఒక శాఖ నుండి మరో శాఖకు మళ్లించడం కాకుండా, సంబంధిత అధికారులు స్వయంగా స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కమిషనర్ స్పష్టం చేశారు. శాఖలన్నీ పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు.ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 14 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించిన అక్రమ నిర్మాణాలు 5, రోడ్ల ఆక్రమణలు వంటి అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు నమోదు కాగా, రెవెన్యూ 1, ఇంజనీరింగ్ 4, ప్రజారోగ్య శాఖలకు సంబంధించిన 1, యూసీడి 2,ఎస్టేట్ 1 ఫిర్యాదులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును అధికారులు స్వయంగా పరిశీలించి, ప్రజలకు స్పష్టమైన మరియు శాశ్వత




పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ డి. చంద్రశేఖర్, ఏ. రవీంద్రరావు, కె. శకుంతల, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ (ఇంచార్జ్) సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సి హెచ్ రత్న బాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆముదార్లంకలో పోలీసుల కార్డన్ సెర్చ్.

**4 ట్రాక్టర్లు ,18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం.**



**చల్లపల్లి: అవనిగడ్డ: జూన్ 8 (వార్తాప్రభ ప్రతినిధి)** కృష్ణా జిల్లా , చల్లపల్లి మండల పరిధిలోని నదీతీర గ్రామమైన ఆముదార్లంకలో సోమవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు.శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ముందస్తు భద్రతా ఏర్పాట్లు అమలుకు వీలుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చల్లపల్లి , అవనిగడ్డ సిఐలు ఈశ్వరరావు ,యువకుమార్ ల నేతృత్వంలో అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని చల్లపల్లి ఎస్ఐ డి.దుర్గావీరాంజనేయులు సహా ఆరుగురు ఎస్సైలు ,75 మంది సిబ్బంది గ్రామంలో జల్లెడ పట్టారు.తనిఖీలలో నాలుగు ట్రాక్టర్లు , 18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని చల్లపల్లి పోలీసు స్టేషన్ కు తరలించారు.తెల్లవారుఝామునే గ్రామంలో పోలీసుల హడావుడి ప్రారంభం కావడంతో కొద్దిసేపు ఏంజరుగుతుందో తెలియని సందిగ్ధత గ్రామస్తుల లో నెలకొనగా విషయం తెలిసిన తరువాత ఊపిరి పీల్చుకున్నారు.

## టీడీపీ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ కాదు అని చెప్పే వారు ఉన్నారా?

**గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి**




**గన్నవరం,జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ అనటానికి మరియు దళితులను ఎన్నికలలో వాడుకోవడానికి నేడు సీనియర్ టీడీపీ దళిత నేత వర్ల రామయ్య రాజ్యసభ అభ్యర్థి విషయంలో టీడీపీ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ కాదు అని ఎవరైనా చెప్పగలరా అని గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి ఆ పార్టీని ప్రశ్నించారు.ఆమే ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితనాయుకుడు వర్ల రామయ్య ని 2020 లో 23 ఏం.ఎల్. ఏ.లు సీట్లు ఉన్నప్పుడు రాజ్యసభ అభ్యర్థిగా ఓడిపోతారని తెలిసి పోటీకి నీల బెట్టటం జరిగిందన్నారు. అంటే దళితులకు టీడీపీ పార్టీ ఎంతో గౌరవం ఉన్నట్లు దళిత జాతిని మోసగించటం కాదా అని నేను ప్రశ్నిస్తున్నా అన్నారు.ప్రస్తుతం నేడు 164 సీట్లు ఉండి గెలిసే పరిస్థితి ఉన్నప్పుడు దళిత నాయకుడు వర్ల రామయ్య అభ్యర్థిగా పోటీకి ఎందుకు పెట్టలేదన్నారు. అంటే ఆ పార్టీకి దళితులు అంటే గిట్టని పార్టీ అనేది ప్రజలందరికీ తెలుసు అని అన్నారు.అలాగే చంద్రబాబు నాయుడు గతంలో దళితులలో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అన్న విషయం దళిత గిరిజన ప్రజలు ఎన్నటికి మర్చిపోరని ఆమే అన్నారు.అలాగే టీడీపీ పార్టీకి దళితుల ఓట్లు అక్కరలేదని టీడీపీ పార్టీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు దళితుల ఓట్లు మా పార్టీ కి అక్కరలేదని బహిరంగంగా ప్రకటించిన విషయం ప్రజలందరికీ తెలిసిందే అన్నారు. ఈ ప్రకటన కూడా టీడీపీ పార్టీ ఖండించలేదని ఆమె అన్నారు.అందు వలన ఆ పార్టీలో ఉన్నా దళిత గిరిజన నాయకులు ఆలోచించాలని వారికి విజ్ఞప్తి చేస్తున్నాను అని ఆమే అన్నారు.

## రాజకీయ కుట్రతోనే కేఎన్ఆర్ పై దుష్ప్రచారం !

**వైయస్ఆర్ సిపి రాష్ట్ర కార్యదర్శి షేక్ గౌస్ మొహిద్దీన్**



**విజయవాడ పశ్చిమ జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మాజీ ముఖ్యమంత్రి,వైసిపి అధినేత వైయస్ జగన్మోహనరెడ్డి పైన ఉన్న కక్షతోనే ఆయన వ్యక్తిగత కార్యదర్శి కేఎన్ఆర్ పై ఎల్లోమీడియా కనీస ఆధారాలు లేకుండా దుష్ప్రచారం చేస్తోం దని వైయస్ఆర్ సిపి రాష్ట్ర కార్యదర్శి షేక్ గౌస్ మొహిద్దిన్ విమర్శి ంచారు .సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌస్ మొహిద్దిన్ మాట్లాడుతూ ఇప్పటి దాకా వైసిపి నాయకులపై అన్యాయమైన రాతలతో,అక్రమకేసులతో వేధించిన ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు కేఎన్ఆర్ టార్గెట్ గా దుర్మార్గ ప్రచారానికి తెర తీశారని విమర్శించారు.20 ఏళ్ల క్రితం చంద్రబాబు ప్రభుత్వ హయాంలో విశాఖలో ప్రాజెక్టు కోసం మత్సడో కంపెనీతో ఏపి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం భూముల కేటాయింపులను సైతం కేఎన్ఆర్ కు ఆపాదిస్తు దుష్ప్రచారం చేస్తున్నారని,సింగపూర్ మంత్రులను చంద్రబాబుకు పరిచయం చేసిన,చంద్రబాబుకు సన్నిహితుడైన రమణారెడ్డి అనే వ్యక్తి కేఎన్ఆర్ బినామీ అంటూ,విజయవాడలో ఒక రియల్టర్ ను గన్ పెట్టి మరీ బెదిరించారంటూ లేనిపోని వార్తలు వండివారుస్తున్నారని మండిపడ్డారు.ఆయనకు సంబంధం లేని ఆస్తులను ఆయనవిగా చెపుతూ దుర్మార్గ ప్రచారం చేస్తున్న మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేఎన్ఆర్ అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని గౌస్ మొహిద్దిన్ డిమాండ్ చేశారు.గుడ్డ కాల్చి ముఖాన వేసి తుడుచుకో అన్నట్లుగా టిడిపి,ఎల్లో మీడియా తీరు ఉందని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు,ఈ విష సంస్కృతిని ఆపకపోతే ప్రజలే సరైన సమయంలో బుద్ధిచెబుతారని ఈ సందర్భంగా గౌస్ మొహిద్దిన్ హెచ్చరించారు.

## నీటి నిల్వల నివారణకు మేజర్ ఔట్‌ఫాల్ డ్రైన్లలో విస్తృతంగా గుర్రపుడెక్కల తొలగింపు



**విజయవాడ పశ్చిమ జూన్ 8 :(వార్త ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలోని మేజర్ అవుట్‌ఫాల్ డ్రైన్లలో గుర్రపుడెక్కల తొలగింపు పనులను విస్తృతంగా చేపడుతున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఇన్నర్ రింగ్ రోడ్‌లోని కండ్రిక జంక్షన్ వద్ద ఉన్న మేజర్ అవుట్‌ఫాల్ డ్రైన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో తొలగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు మరియు చీఫ్ ఇంజనీర్ (ఇన్‌చార్జ్) పి. సత్యకుమారి మార్గదర్శకత్వంలో నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రధాన కాలువలు, డ్రైన్లలో గుర్రపుడెక్కలు మరియు ఇతర అడ్డంకులను శరవేగంగా తొలగిస్తున్నామని తెలిపారు.వర్షాకాలంలో నగరంలో ఎక్కడా నీటి నిల్వలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, ఇంజనీరింగ్ సిబ్బంది ప్రతిరోజూ కాలువలను పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. నగర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య, డ్రైనేజీ వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు

## పోలీసులకు మిల్టన్ వాటర్ బాటిల్స్ అందించిన జనసేన నేత కడవ కొల్లు రంగ

**20 మంది పోలీసులకు 20 మిల్టన్ వాటర్ బాటిల్స్ అందజేత కడవకొల్లు రంగను అభినందించిన ఎస్సై చాణిక్య**



**కోడూరు, జూన్ 8 (వార్తా ప్రభ) :** కోడూరు మండల పరిధిలోని మందపాకల గ్రామానికి చెందిన జనసేన నేత కడవకొల్లు రంగా కోడూరు పోలీస్ స్టేషన్ సిబ్బందికి మిల్టన్ వాటర్ బాటిల్ సోమవారం నాడు అందించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ చాణిక్య ను మర్యాదపూర్వకంగా కలుసుకొని 20 మిల్టన్ వాటర్ బాటిల్స్ లను అందజేశారు. సామాజిక స్ఫూర్తితో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమనిఈ సందర్భంగా కడవకొల్లు రంగాను ఎస్ఐ చాణిక్య అభినందించారు. విధి నిర్వహణలో ఎప్పుడు కూడా బిజీగా ఉండే పోలీసులకు కూలింగ్ వాటర్ బాటిల్స్ అందించడం సంతోషంగా భావిస్తున్నట్లు కడవకొల్లు రంగ తెలిపారు . సిబ్బంది హేమంత్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## చిన్నారులు

చిన్ని చిన్ని పిల్లలు
సన్నజాజి సుమములు
కన్నవారి ఆస్తులు
మిన్న వారి మనసులు
ముద్దులొలుకు బాలలు
ముద్దబంతి పూవులు
శ్రద్ధగా చదివితే
వృద్ధికి వారు బాటలు
మల్లెలాంటి మాటలు
పల్లెసీమ సొగసులు
అల్లరిలో ప్రథములు
ఎల్లరికీ ఇష్టులు
చక్కనైన పిల్లలు
చుక్కల్లా వెలుగులు



మొక్కల్లా పెంచితే
మిక్కిలి ప్రయోజకులు

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# శ్రీకృష్ణ యాదవ సేవాసమితి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**రూరల్ డిసిపి బి లక్ష్మీనారాయణ చేతులమీదుగా పురస్కారం అందుకున్న గడ్డం సుమాంజ**

**జగ్గయ్యపేట జూన్ 8 (వార్తా ప్రభ)** విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శ్రీకృష్ణ యాదవ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా లో పదవ తరగతిలో 500 మార్కులు పైగా సాధించిన యాదవ విద్యార్థిని విద్యార్థులకు ఆదివారం ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట పట్టణానికి చెందిన వార్తా ప్రభ రిపోర్టర్ గడ్డం రాంబాబు యాదవ్ కుమార్తె గడ్డం సుమాంజలి పదవ తరగతిలో 539 మార్కులు సాధించి విజయవాడ రూరల్ డిసిపి బి లక్ష్మీనారాయణ చేతుల మీదగా ప్రతిభ పురస్కారాన్ని అందుకుంది. ఈ సందర్భంగా విజయవాడ రూరల్ డీసీపీ బి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతిభ పురస్కారాలు పొందిన విద్యార్థిని విద్యార్థులు భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ బివి రమణ కుమార్ యాదవ్, రిటైర్డ్ ఐఏఎస్ ఉదయలక్ష్మి యాదవ్, డాక్టర్ అలా వెంకటేశ్వరరావు యాదవ్, మాజీ కార్పొరేటర్ కాకు మల్లికార్జున యాదవ్, అనేక రంగాల్లో ఉన్నత స్థాయి పొందిన యాదవ మేధావులు పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించి విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేసారు. మరియు ఇటీవల గ్రూప్ - 2 లో ఉద్యోగాలు సాధించిన యాదవులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి సహకరించిన ముఖ్య అతిథులకు, మేధావులకు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు , డాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులకు, అధికారులకు, విద్యార్థుల ఉన్నతికి బాసటగా నిలిచిన తల్లిదండ్రులకు, కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఆర్థిక తోడ్పాటు అందించిన యాదవ కుటుంబ సభ్యులకు, కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులకు అఖిల భారత యాదవ మహాసభ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రెటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ హృదయపూర్వక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సజావుగా సాగుతున్న పదవ తరగతి సప్లిమెంటరీ మూల్యాంకనం.

**మూల్యాంకన ప్రక్రియను పరిశీలిస్తున్న డిఇఓ.**



**మచిలీపట్నం జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరంలోని లేడీ యాంప్తిల్ గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల (ఏ ఎస్ ఈ) ఏ పీ ఓ ఎస్ ఎస్ పదవ తరగతి పరీక్షల మూల్యాంకన కార్యక్రమం సజావుగా సాగుతోంది. సోమవారం ప్రారంభమైన ఈ మూల్యాంకన ప్రక్రియ జూన్ 10 వరకు నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా మొత్తం 654 మంది ఉపాధ్యాయులు మూల్యాంకన విధుల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి యువి సుబ్బారావు మూల్యాంకన కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మూల్యాంకన ప్రక్రియ సజావుగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా పూర్తి అయ్యేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో తెలిపారు.

## కొండపల్లి లో ఉచితంగా చేపమందు పంపిణీ



**ఇబ్రహీంపట్నం, జూన్ 08(వార్తా ప్రభ ప్రతినిధి):** మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా ఉబ్బసం, దగ్గు, శ్వాసకోశ వ్యాధిగ్రస్థులకు కొండపల్లి ఆరు పంపుల సెంటర్ లో జనాబ్ హాజీ హకీమ్ మొహమ్మద్ యూసఫ్ అలీ జ్ఞాపకార్థం వారి మనుమలు మొహమ్మద్ మసూద్ అలీజిన్నా, మొహమ్మద్ మహమూద్ అలీ సోమవారం ఉచితంగా చేపమందు పంపిణీ చేశారు. వనమూలికలతో తయారు చేసిన మందును చేపకు పెట్టి మింగించారు. శాకాహారులకు అనుపానంతో ఇచ్చారు. ప్రతి ఏటా మృగశిరకార్తె రోజున ఉబ్బసమునకు ఉచితంగా చేప మందు పంపిణీ చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం వరకు చేప మందు పంపిణీ కొనసాగుతుంది. 1920 నుంచి తమ వంశస్థులు ద్వారా మొదలై నేటికి 106 సంవత్సరాలైందని మొహమ్మద్ మసూద్ అలీ జిన్నా, మొహమ్మద్ మహమూద్ అలీ చెప్పారు. చేపమందు తీసుకున్న వారు వరుసగా మూడు సంవత్సరాలు తీసుకోవాలన్నారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ఖమ్మం, ప్రకాశం, గోదావరి జిల్లాల నుంచి ఆస్తమా వ్యాధిగ్రస్థులు వచ్చి చేప మందును తీసుకున్నారు. జున్నుపాలు, వాలగ చేప, బూడిద గుమ్మడికాయ, వంకాయ, గోంగూర వంటివి దీర్ఘకాలం వాడకూడదని తెలిపారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా అమలు - జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు భారత ఎన్నికల సంఘం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో ఎదురవుతున్న ప్రాయోగిక సమస్యలు, విచారణ నోటీసుల జారీ విధానం, విదేశాల్లో ఉన్న ఓటర్ల ప్రతినిధుల హాజరు, స్పెల్లింగ్ లోపాల వల్ల తలెత్తుతున్న క్రమరాహిత్యాల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ భారత ఎన్నికల సంఘం సభ్యుల నుంచి స్పష్టత కోరారు. సోమవారం భారత ఎన్నికల సంఘం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్లోని తన ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమం అమలు, బీఎల్ఓలు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు నిర్వహించాల్సిన బాధ్యతలు, పోర్టల్‌లో అందుబాటులో ఉన్న విధానాలపై భారత ఎన్నికల సంఘం సభ్యులు వివిధ రాష్ట్రాల ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పలు కీలక సందేహాలను ప్రస్తావించి ఎన్నికల సంఘం సభ్యుల నుంచి వివరణలు పొందారు.విచారణ (హియరింగ్) నోటీసులను ఏఈఆర్వోలు కూడా జారీ చేయవచ్చా అనే జిల్లా కలెక్టర్ సందేహానికి ఎన్నికల సంఘం సభ్యులు స్పందిస్తూ, నోటీసుల జారీకి ఈఆర్వోలతో పాటు ఏఈఆర్వోలకు కూడా అధికారం కల్పించినట్లు తెలిపారు. అయితే తుది విచారణ మాత్రం ఈఆర్వో కార్యాలయంలో ఈఆర్వో ద్వారానే నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు.విదేశాల్లో లేదా ఇతర ప్రాంతాల్లో ఉండి విచారణకు హాజరు కాలేని ఓటర్ల తరపున అధీకృత ప్రతినిధులు హాజరయ్యే అవకాశంపై కలెక్టర్ ప్రశ్నించగా, ఓటరు సమర్పించిన పత్రాలు, ప్రతినిధి సమర్పించిన ధ్రువీకరణ పత్రాలు సరిపోలినట్లయితే అటువంటి హాజరును పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని ఎన్నికల సంఘం సభ్యులు వివరించారు.అలాగే, గత ఓటరు జాబితా సవరణల సమయంలో నమోదైన స్పెల్లింగ్ పొరపాట్ల కారణంగా వేల సంఖ్యలో క్రమరాహిత్యాలు గుర్తింపబడుతున్నాయని దృష్టికి తీసుకువచ్చారు. కేవలం స్పెల్లింగ్ లోపాల కారణంగా తలెత్తిన క్రమరాహిత్యాలకు నోటీసులు జారీ చేయకుండా, బీఎల్ఓ లేదా ఈఆర్వో స్థాయిలో ధృవీకరించి పరిష్కరించే అవకాశం కల్పిస్తే ఎన్నికల సిబ్బందిపై పనిభారం గణనీయంగా తగ్గుతుందని సూచించారు.దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం సభ్యులు, ఓటరు సమర్పించిన సహాయక పత్రాల ఆధారంగానే వివరాల ధృవీకరణ సాధ్యమవుతుందని, విచారణ ప్రక్రియలోనే ఫారమ్‌లోని వివరాలు, ఆధార పత్రాల్లోని వివరాల మధ్య సరిపోలికను నిర్ధారించవచ్చని పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్లో ఇంచార్జ్ డిఆర్ఓ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, బందరు ఆర్డీవో కే సాంబశివరావు, సమగ్ర శిక్ష ఏపీసి ఆర్ కుముదిని సింగ్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## రాజ్యసభ ఎన్నికల నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



**జగ్గయ్యపేట జూన్ 8 (వార్తప్రభ)** రాజ్యసభ ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా ఎంపికైన చింతకాయల విజయ్, సాన సతీష్ కుమార్, భాష్యం రామకృష్ణ సోమవారం అమరావతిలోని శాసనసభ ప్రాంగణంలో తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన నామినేషన్ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తో కలిసి జగ్గయ్యపేట శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, ఏపీ పీఏసీ కమిటీ సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నారు.పార్టీ అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే , రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం మరియు ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల సాధనలో రాజ్యసభ సభ్యులుగా వారు సమర్థవంతంగా సేవలందిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి, రాష్ట్ర హక్కుల సాధనకు రాజ్యసభలో వారు కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవతా హనుమాన్ జంక్షన్ శాఖ ద్వారా 6,000 ఆర్థిక సహకారం



**హనుమాన్ జంక్షన్, జూన్ 8(వార్తాప్రభ)** మానవతా కార్యాలయంలో మానవత ప్రెసిడెంట్ గంటా ఇందిరా దేవి,కన్వీనర్ గంటా సత్యనారాయణ దంపతుల మనుమరాళ్లు మైరాకృష్ణ,అనేయ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఆశాజ్యోతి,3,000 వేల రూపాయలు,ఆదిత్య పాఠశాలలకు 3,000.వేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు,మానవత బాధ్యులు మరీదు వెంకటస్వామి,పాబోలు గణేష్ బాబు,సభ్యులు వేగిరెడ్డి సూర్యనారాయణ, జే వి వి సత్యన్నారాయణ, నారగాని కొండలరావు, వడ్డి రాజేశ్వరరావు, నరసింహారావు మానవతా డైరెక్టర్లు కార్యవర్గ సభ్యులు గౌరవ సలహాదారులు తదితరులు పాల్గొని పిల్లలకు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని దీవించారు.

## దివ్యాంగులకు కృత్రిమ పాదాల పంపిణీ

**కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరాం ధనుంజయ (చిన్నబాబు)**



**జగ్గయ్యపేట జూన్ 8 (వార్తప్రభ )** పట్టణంలోని ఉక్కు కళావేదికలో స్వయంశక్తి విభిన్నప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్ సహకారంతో నిర్వహించిన కృత్రిమ పాదాల పంపిణీ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరాం ధనుంజయ (చిన్నబాబు) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 52 మంది దివ్యాంగులకు కృత్రిమ పాదాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి విభిన్నప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ చైర్మన్ గడిపూడి నారాయణ స్వామి ముఖ్య అతిథిగా హాజరై, దివ్యాంగుల సంక్షేమానికి నిరంతరం సేవలందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులను అభినందించారు.దివ్యాంగుల సంక్షేమం కోసం ఇప్పటి వరకు బ్యాటరీ సైకిళ్లు, వీల్‌చైర్లు, మూడు చక్రాల వాహనాలు తదితర సహాయక పరికరాలను అందిస్తూ విశేష సేవలందిస్తున్న వడ్డెపూడి ఉమామహేశ్వరరావు ని దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించారు.ఈ సందర్భంగా వడ్డెపూడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, జగ్గయ్యపేట నియోజకవర్గం లో మా దివ్యాంగులకు అన్ని విధాలుగా ఆదుకుంటూ, ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ ,ఎంతో సహకరిస్తున్న శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కి ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు చైర్మన్ గడిపూడి నారాయణ స్వామి కి, దివ్యాంగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రతి దివ్యాంగుడి అవసరాలను గుర్తించి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

**శ్రీరాం ధనుంజయ (చిన్నబాబు) మాట్లాడుతూ** సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలన్నదే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం అభినందనీయమని అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర , రోటరీ క్లబ్ సభ్యులు రంగారావు , సాంబశివరావు , దివ్యాంగుల సంఘ ప్రతినిధులు, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై సచివాలయ అధికారికి వినతి పత్రం అందజేసిన సిపిఎం పార్టీ నాయకులు.



**జగ్గయ్యపేట జూన్ 8 (వార్తప్రభ)** మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో గల గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సచివాలయ జూనియర్ అసిస్టెంట్ షేక్ సుల్తానాకు సోమవారం సిపిఎం పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల, పట్టణ కార్యదర్శి ఎస్ నాగమణి మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి సమస్య, కోతులు, కుక్కలు సమస్యతోపాటు గ్రామంలో డ్రైనేజీ కాలువలు పూడిక తీయాలని, గ్రామంలో అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించాలని, రామచంద్రనిపేట రోడ్ లో గల ఎర్ర కాలవలో గుర్రపు డెక్కతో నిండిపోయిందని రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని గుర్రపుడెక్క తొలగించాలని, వీధిలైట్లను వేయించాలని, గ్రామంలోని వడ్డెర కులస్తులకు స్మశాన వాటికకు వెళ్లటానికి నీళ్లలో వెళ్ళవలసి వస్తుందని కాబట్టి కాలువ మీద బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, గతంలో మాదిరిగా ఇళ్లకు వచ్చి చెత్తను సేకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కోటా కృష్ణ, కాకనబోయిన సుబ్బారావు, షేక్ మీరా సాహెబ్, షేక్ గౌస్ మియా, కె వెంకటేశ్వరరావు, కే రామకృష్ణ, జె వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జన చైతన్య అవగాహన



**హనుమాన్ జంక్షన్, జూన్ 8(వార్తాప్రభ)**హనుమాన్ జంక్షన్ నాలుగు రోడ్ల సెంటర్లో మచిలీపట్నం ఎస్పి వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు హనుమాన్ జంక్షన్ ఎస్సై ఎం శ్రీనివాస్ జన చైతన్యం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్మెట్ ఉపయోగించటం వల్ల మనకు జరిగే ఉపయోగాలను వివరించారు. హెల్మెట్ లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదంలో మనిషి తలకు దెబ్బలు తగిలి చనిపోవడం జరుగుతుంది అని, మనిషి చనిపోతే వారి కుటుంబంలో ఎన్నో ఇబ్బందులు వస్తాయని ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరికి ఎస్సై శ్రీనివాస్ వివరించారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి మీ కుటుంబాన్ని కాపాడుకోవాలని కోరారు. అంతేకాకుండా మత్తు పానీయాలు, గంజాయిలకు అలవాటు అవ్వడం వల్ల ఆరోగ్యం పాడైపోయి మీకుటుంబం రోడ్డున పడుతుందని వినిపించారు.

## మహిళలపై దాడులు, అక్రమ కేసులు, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యంపై రౌండ్ టేబుల్ సమావేశం



**జగ్గయ్యపేట జూన్ 8 (వార్తప్రభ)** పట్టణం ఆర్టీసీ డిపో దగ్గర ఎలక్ట్రికల్ యూనియన్ కార్యాలయం నందు కూటమి ప్రభుత్వం వైఫల్యాలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగు రౌండ్ టేబుల్ కార్యక్రమం పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్ అధ్యక్షతన జరుగు కార్యక్రమంలో వామపక్ష నాయకులు పలు కార్మిక సంఘాలు, బీసీ సంఘ నాయకులు, పలూ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అవుతున్న ప్రజలకు చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మహిళలు, రైతులు, యువత, పేదల అభ్యున్నతే లక్ష్యమని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు, వేధింపులు పెరిగినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో, పంట నష్టాలకు తగిన పరిహారం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు.గతంలో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం రైతులు, మహిళలు, విద్యార్థులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రజలు కూటమి ప్రభుత్వ పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రానున్న రోజుల్లో ప్రజల సమస్యలపై మరింతగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో పరిపాలన విధానంలో గాని, అభివృద్ధి విధానంలో గాని పూర్తిగా విఫలం అయింది, అభివృద్ధి సంక్షేమమైన పథకాలు అడిగితే ఒక అమరావతి చూపించి పబ్బం గడుపుతున్న చంద్రబాబు.మెగా డీఎస్సీ కాదు దగాడిఎస్సి తీవ్రంగా ఖండించారు, చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చేస్తున్న మోసాలను రాష్ట్ర ప్రజలు గమనించాలి అన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజా ఉద్యమం చేస్తాం అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ పార్టీ కార్యదర్శి అంబోజి శివాజీ , బీసీ ఉద్యమ నాయకులు తుమ్మాటి కృష్ణమాచార్యులు , ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు నంబూరు చలపతిరావు , కాంగా వెంకటేశ్వరరావు , దర్శి వెంకటేశ్వర్లు, పట్టణ వైస్ చైర్మన్ హాఫీజున్నిసా, సీనియర్ నాయకులు బూడిద నరసింహారావు, చల్లా వైకుంఠ రావు, మండవ శ్రీనివాస్ గౌడ్, చింతకుంట్ల వెంకటరెడ్డి, బత్తుల రామారావు, కన్నమాల శ్యామల్, పెంటి శ్రీనివాసరావు, పసుపులేటి సత్య శ్రీనివాసరావు, నంబూరి రవి, శివరాత్రి పృథ్వి, దర్శనాల వెంకటరమణ, ఆదోరి సుజాత, చల్లా సుశీల, మాతంగి నాగబాబు, గొర్రెపాటి బుల్లయ్య, బజార్ సాయి, శీలం మంగారావు, నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అనుమంచిపల్లి వద్ద ఆగి ఉన్న ఆటోని ఢీ కొట్టిన ఓమిని వ్యాన్

**సిపిఆర్ చేసి సహాయం చేసిన కౌన్సిలర్ వట్టెం మనోహర్**



**జగ్గయ్యపేట జూన్ 8 (వార్తప్రభ)** మండలం అనుమంచిపల్లి గ్రామం నేషనల్ హైవే వద్ద సందీప్ అనే ఆటో డ్రైవర్ ఆటోలో ఆగి ఉండగా వెనకనుంచి వచ్చిన ఓమ్ని వ్యాన్ అతివేగంగా వచ్చి గుద్దడంతో రెండు వాహనాలు చెట్లుకి గుద్దుకొని ప్రమాదానికి గురైయ్యాయి. ఈ సందర్భంలో సందీప్ ప్రమాద స్థితిలో స్పృహ లేకుండా పడిపోయి ఉన్నాడు వెనకగా వస్తున్న జగ్గయ్యపేట వైసిపి మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ వెంటనే ఆగి ప్రమాదం జరిగినటువంటి ఆటోలో నుండి సందీప్ ను బయటకు తీసి రోడ్డు పక్కన పడుకోబెట్టి సిపిఆర్ చేసినారు. అంతట తను స్పృహలోకి వచ్చి నాడు. అక్కడ ఉన్న స్థానికుల సహాయంతో తన సొంత వాహనంలో అతని ఏక్కించుకొని జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి డాక్టర్లతో మాట్లాడి అత్యవసర వైద్యాన్ని అందించమని కోరడం జరిగింది. అంతేకాకుండా వారి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినారు.

## 10న,శ్రీమన్నారాయణునికి మహాభిషేకం



**కోడూరు, జూన్ 8 (వార్తా ప్రభ) :**ఉల్లిపాలెం శ్రీమన్నారాయణు నికి ఈనెల 10 న మహాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీ త్రిదండి అష్టాక్షరి జీయర్ స్వామిజీ తెలిపారు.ఆలయ రాజగోపుర కుంభ ప్రోక్షణ జరిగి 41 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ మహాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీ అనగా బుధవారం ఉదయం స్వామివారి మూలవిరాట్ కు 473 కలశములతో అభిషేకం,శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన,సాయంత్రం లక్ష మల్లెపూలతో స్వామివారికి అర్చన,అనంతరం పూర్ణాహుతి నిరవాహిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చెర్మెన్ బూరగడ్డ హరినాథ్ బాబు,ఇంకొల్లు అశోక్ మహరాజ్,ఉల్లి రంగారావు,అన్నం సురేంద్ర, మారుబోయిన ప్రసాద్,అడుసుమిల్లు రాము పాల్గొన్నారు.

# వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలి

- లే ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి

- హెచ్‌బిఎల్ ఉద్యోగులకు ఉచిత ఎముకలు, కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరం





**విశాఖపట్నం:జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఎముకలు, కీళ్ల పటిష్టతకు అవసరమైన పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి సూచించారు. స్థానిక హెచ్‌బిఎల్ (హెచ్‌బిఎల్) కంపెనీ ఉద్యోగుల కోసం లీ ఫార్మా లిమిటెడ్, లీ హెల్త్ డొమైన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఎముకలు, కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హెచ్‌బిఎల్ సంస్థ భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 150 మంది ఉద్యోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆరోగ్య పరీక్షల్లో చేతి పట్టు బలం, శరీర ద్రవ్యరాశి సూచీ (బాడీ మాస్ ఇండెక్స్), హిమోగ్లోబిన్ స్థాయి, యాదృచ్ఛిక రక్తంలో చక్కెర పరీక్ష, రక్తపోటు, ఎముక ఖనిజ సాంద్రత పరీక్ష, శరీర కూర్పు విశ్లేషణ వంటి పలు పరీక్షలు చేపట్టారు. అనంతరం వైద్యులు, పోషకాహార నిపుణులు పరీక్షల నివేదికలను పరిశీలించి, ఉద్యోగులకు అవసరమైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులపై వ్యక్తిగత సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆళ్ళ లీలారాణి మాట్లాడుతూ శరీరంలో ఎముకలు, కీళ్లు అత్యంత ముఖ్యమైనవని, వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల ఆహారం ద్వారా ఎముకల సమస్యలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శిబిర సమన్వయకర్తలు సరోజిని, జయలక్ష్మి, డాక్టర్ రావుబాబు, పోషకాహార నిపుణులు మాధురి, క్రాంతి, జీఎన్ఎమ్ సిబ్బంది భాగ్యలత, పవని, హెచ్‌బిఎల్ బృందం, లీ ఫార్మా సిబ్బంది పాల్గొన్నారు.

# గత సంవత్సర విజయాలు భవిష్యత్తు కాలపు పునాదులు

కె.వి.ఆర్ జూనియర్ అండ్ ఒకేషనల్ కాలేజ్ కరస్పాండెంట్ కే వెంకటేశ్వరరావు ( కె.వి.ఆర్ )



విస్సన్నపేట,,, జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి) స్థానిక మండల కేంద్రంలో ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ కు అతి సమీపంలో గత విద్యా సంవత్సరంలో ప్రారంభించిన కె.వి.ఆర్ జూనియర్ అండ్ ఒకేషనల్ కాలేజ్ అత్యున్నత స్థాయి ర్యాంకులు సాధించిందని సంస్థ అధినేత కె.వి.ఆర్ మీడియా సమావేశంలో తెలియజేశారు. గత సంవత్సరం సాధించిన అత్యున్నత విజయాలు ప్రస్తుత సంవత్సరానికి పరమపద సోపానాలుగా అత్యధిక శాతం విద్యార్థులు జాయిన్ కావడానికి తల్లిదండ్రుల ఆశీస్సులు లభించినట్లు చెప్పారు. నామమాత్రపు ఫీజులకు కార్పొరేట్ స్థాయి ఫ్యాకల్టీలసే ఉత్తమ విద్యా బోధన చేయించడంతో మంచి ర్యాంకులు సాధించామన్నారు. ఎంపీసీ బైపీసీ ఎంఈసి సిఇసి జనరల్ కోర్సులు ఐకాన్ బ్యాచ్ ఎంసెట్ మరియు నీట్ పరీక్షలకు అత్యంత అనుభవం సాధించిన సీనియర్ల తో కోచింగ్ వీటితో పాటు ఏసీ మరియు సీసీ కెమెరాలు పర్యవేక్షణ భద్రతలు ప్రత్యేక ఆకర్షణగా రెండవ సంవత్సరంలోకి విజయవంతంగా అడుగుపెట్టామన్నారు. కాలేజీ బస్సు సౌకర్యం , ఏపీఎస్ఆర్టీసీ బస్ పాస్ సౌకర్యం మరియు హాస్టల్ వసతి ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు నూతన అడ్మిషన్లకు 955 00 90339 70 7844388 నంబర్లకు లేదా నేరుగా నైనా సంప్రదించవచ్చని కె.వి.ఆర్ తెలియజేశారు.

# హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ



**కాకినాడ, జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇదేంది సారూ, హెల్మెట్ మరిచారా... హెల్మెట్ ధరించి ప్రయాణిస్తే , అది మీ ప్రాణాలను కాపాడుతుందని కాకినాడ ట్రాఫిక్ సీఐ ఎన్. రమేష్ ప్రతిరోజూ వాహనదారులకు చెబుతున్నారు. అయినప్పటికీ వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్నారు. ఎంతో సహనంతో కాకినాడ ప్రధాన కూడళ్లలో హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. హెల్మెట్ లేని వాహన దారులకు రూ. 1,000/- జరిమానాకి బదులుగా కొత్త హెల్మెట్లు కొనిపించి, ద్విచక్ర వాహనం పై ప్రయాణించేలా అవగాహన కల్పిస్తున్నారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించకపోవడం వల్ల, రోడ్డు ప్రమాదాలకు గురై చనిపోతున్నారని, మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్ఎఫ్‌సీఎల్‌లో బాయిలర్ భద్రత అవగాహన!!

● భద్రతే పరిశ్రమల విజయానికి పునాది ● కాలానుగుణ తనిఖీలు ప్రమాదాలను నివారిస్తాయి ● ఆపరేటర్ల అప్రమత్తతే ప్రమాద నివారణకు కీలకం ● భద్రతా ప్రమాణాల్లో రాజీకి తావులేదు ● సురక్షిత నిర్వహణతో పరిశ్రమల ప్రగతి సాధ్యం ● తెలంగాణ ప్రభుత్వ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ యు.భీమారావు

పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 8 (వార్తాప్రభ ప్రతినిధి) ప్రభుత్వ 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక 'ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక'లో భాగంగా రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో బాయిలర్ భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పరిశ్రమల్లో బాయిలర్‌ల సురక్షిత నిర్వహణతో పాటు భద్రతా ప్రమాణాలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వ బాయిలర్స్ శాఖ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ యు. భీమారావు మాట్లాడుతూ బాయిలర్ భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా పారిశ్రామిక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. బాయిలర్‌లకు నిరంతర నిర్వహణ, కాలానుగుణ తనిఖీలు, ఆపరేటర్ల అప్రమత్తత అత్యంత కీలకమని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, ఆర్ఎఫ్‌సీఎల్ జీఎం (ఓ అండ్ ఎం) ఎం. ప్రేమ్‌కుమార్ పాల్గొని భద్రతా సంస్కృతి ప్రతి ఉద్యోగిలో పెంపొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాయిలర్‌ల నిర్వహణకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు, సురక్షిత ఆపరేషన్ విధానాలు, ప్రమాద నివారణ చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన విధానం, ఉత్తమ నిర్వహణ పద్ధతులపై నిపుణులు సాంకేతిక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాయిలర్ ఆపరేటర్లు, ఇంజినీర్లు, విభాగాధిపతులు, సెక్షన్ ఇన్‌ఛార్జీలు పాల్గొని భద్రతా అంశాలపై విలువైన సూచనలు తెలుసుకున్నారు.




# హరీష్ రావు మాటలన్నీ అబద్ధాలే!!

● రైతు పక్షపాతి సీఎం రేవంత్ రెడ్డి ● అబద్ధాల దిట్ట కేసీఆర్ కుటుంబం ● 'కాళేశ్వరం' కూలేశ్వరం అయ్యింది ● శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు చెక్కుచెదరలేదు ● వరి వేస్తే ఉరి అన్న వాళ్లు.. రైతు సంక్షేమం గురించి మాట్లాడుతారా? ● వరంగల్ డిక్లరేషన్ మార్క్ ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ ● గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు, 2 రోజుల్లోనే ఖాతాల్లోకి డబ్బులు ● కేంద్రం కాదన్నా రూ.3500 కోట్లతో మక్కల కొనుగోలు చేసిన ప్రజా ప్రభుత్వం ● మంత్రుల పర్యటనలు కనబడడం లేదా? ● మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే ● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే ● ప్రభుత్వ విప్ విజయరమణ రావు



**పెద్దపల్లి: జూన్ 8 (వార్తాప్రభ ప్రతినిధి)** పెద్దపల్లిలో సోమవారం కాంగ్రెస్ శ్రేణుల సమక్షంలో జరిగిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ప్రతిపక్ష బిఆర్ఎస్ వైఖరిపై నిప్పులు చెరిగారు. సీనియర్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆదివారం నాటి సమావేశంలో మాట్లాడిన మాటలన్నీ పచ్చి అబద్ధాలని, అసత్యాలనే పదే పదే చెప్తూ నిజం చేయాలనుకోవడం ప్రజాస్వామ్యానికే విడ్డూరమని ఆయన తీవ్రంగా ఖండించారు. నాడు అధికారంలో ఉండి 'వరి వేస్తే ఉరే' అంటూ అన్నదాతల గుండెల్లో గునపాలు దించిన బిఆర్ఎస్ నాయకులు, నేడు ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను చూసి ఓర్వలేక తీవ్ర నైరాశ్యంలో కూరుకుపోయారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం రైతులను అప్పుల ఊబిలో నెట్టి, బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా మార్చితే... నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్ డిక్లరేషన్ ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేసి రైతన్నల కన్నీళ్లు తుడిచిందని భావోద్వేగంగా గుర్తుచేశారు. ఈ యాసంగిలో కేంద్రం పరిమితులు విధించినా, ఏకంగా 70 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతు పక్షపాతిగా నిలిచామని, అలాగే కేంద్రం నిరాకరించినా రూ. 3500 కోట్ల బడ్జెట్‌తో మక్కలను కొనుగోలు చేసి ఆ సొమ్మును నేరుగా రైతుల ఖాతాల్లో వేసిన ఘనత తమదేనని స్పష్టం చేశారు. గతంలో క్వింటాలుకు 10 కిలోల చొప్పున తరుగు పేరిట రైతుల నడ్డి విరిచిన చరిత్ర బిఆర్ఎస్‌ది అయితే, నేడు గింజ కటింగ్ లేకుండా పంటను కొని, కేవలం రెండు రోజుల్లోనే నగదు జమ చేస్తూ అన్నదాతకు కాంగ్రెస్ వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. కొనుగోలు కేంద్రాలను మంత్రులు సందర్శించడం లేదన్న హరీష్ రావు వ్యాఖ్యలను తిప్పికొడుతూ... ఇటీవలే పెద్దకలవల కేంద్రంలో పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో కలిసి తామంతా స్వయంగా సమీక్షలు నిర్వహించిన విషయాన్ని కళ్లకు కట్టారు. కేసీఆర్, హరీష్ రావులు తామే ఇంజనీర్లుగా మారి రూ. లక్ష కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కూలేశ్వరంగా మారి ప్రజల ఆశలను ఆవిరి చేసిందని, కానీ నాటి కాంగ్రెస్ హయాంలో కట్టిన ఎల్లంపల్లి, జూరాల, కడెం ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరకుండా నిలిచి కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు సజీవ సాక్ష్యాలుగా నిలిచాయని కొనియాడారు. కేసీఆర్ కుటుంబం ఇకనైనా అబద్ధాల రాజకీయాన్ని పక్కనబెట్టి ప్రభుత్వానికి హుందాగా సలహాలు ఇవ్వాలని హితవు పలుకుతూ... నూటికి నూరు శాతం రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, రేవంత్ రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని విజయరమణ రావు ధీమా వ్యక్తం చేశారు.

# పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు బెదిరింపు కాల్స్



**పెనమలూరు జూన్ 8 (వార్త ప్రభ, ప్రతినిధి)**పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఆదివారం మధ్యాహ్నం బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చిన ఘటన కలకలం రేపింది,తన పేరు భాస్కర్ రెడ్డి అని పరిచయం చేసుకున్న వ్యక్తి o447773212073 నంబర్ నుంచి ఫోన్ చేసి, నీ కుటుంబ సభ్యులు బయట ప్రాణాలతో ఎలా తిరుగుతారో చూస్తాం అంటూ తీవ్ర హెచ్చరికలు చేసినట్లు సమాచారం.ఈ బెదిరింపులను తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వెంటనే పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు,కాల్ వచ్చిన నంబర్ వివరాలు,కాల్ చేసిన వ్యక్తి గుర్తింపుపై విచారణ చేపట్టారు. లండన్ లో ఉంటూ చోడవరం గ్రామానికి చెందిన మాలపాటి భాస్కర్ రెడ్డి ఈ ఫోన్ కాల్ చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సోషల్ మీడియాలో అసభ్యకర మాటలతో వీడియోస్ పెట్టినందుకు పెనుమూరు పోలీసులు అరెస్ట్ చేశారు, అయిన ఇతను తీరులో మార్పు రాలేదు. ఇతనే ఈ బెదిరింపు కాల్స్ చేస్తున్నాడేమోనని కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు .ప్రజాప్రతినిధులకు,వారి కుటుంబ సభ్యులకు బెదిరింపులు చేయడం తీవ్ర నేరమని,ఇటువంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు,కార్యకర్తలు కోరుతున్నారు. అన్ని కోణాల్లో విచారణ జరిపి నిందితుడిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి సేవలో కేరళం డిజిపి చంద్రశేఖర్.



**మోపిదేవి: అవనిగడ్డ: జూన్ 8 (వార్తాప్రభ ప్రతినిధి)** కృష్ణా జిల్లా మోపిదేవిలో స్వయంభువుగా వేంచేసియున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని కేరళం రాష్ట్ర డిజిపి రవడ చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.స్వామివారి దర్శనానికి ఆలయానికి వచ్చిన డిజిపి చంద్రశేఖర్ కు ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.స్వామివారి నాగ పుట్టలో పాలు పోసి మొక్కు బడులు చెల్లించుకున్న అనంతరం గర్భాలయంలో కొలువుదీరిన శ్రీ స్వామివారిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా ఆయనకు స్వామి వారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందించారు.ఆయనకు ఆలయ వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు.

# ముగిసిన ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల ధృవీకరణ పత్రాల పరిశీలన



**నూజివీడు, జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆర్జీయూకేటీలో ప్రవేశాలకు ప్రత్యేక కేటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధృవీకరణ పత్రాల పరిశీలన సోమవారంతో ముగిసింది. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మద్దాలి లక్ష్మీనారాయణరావు, డైరెక్టర్ ఆచార్య గోపాలరాజు, ఏవో డా. లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డా. చిరంజీవి ధృవపత్రాల పరిశీలనా ప్రాంతాన్ని సందర్శించారు. ప్రతీ విభాగాన్ని ప్రత్యేకంగా పరిశీలించి ధృవీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుపుతున్న తీరుపట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎన్.సి.సి 305 మందికి 185 మంది, క్యాప్ 55 మందికి 42 మంది, స్పోర్ట్స్ 119 మందికి 90 మంది, భారత్ స్కౌట్స్ ఒ గైడ్స్ 282 మందికి 195 మంది మొత్తంగా 761 మంది అభ్యర్థులకు 512 మంది సర్టిఫికేట్ వెరిఫికేషన్ కొరకు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ మరియు ఆర్జీయూకేటీ ప్రవేశాల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ పర్యవేక్షించారు. ఈ ప్రక్రియలో డీఎస్డబ్ల్యు డా. రాజేష్, గణిత అధ్యాపకులు సతీష్ కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అర్జునరావు, ఇంకా వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# పెడన పట్టణానికి వార్డుల బైఫర్ కేషన్ అవసరం లేదు....



**మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కమాల్**

పెడన జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)పట్టణానికి సంబంధించిన మున్సిపల్ వార్డుల విస్తరణ వల్ల కొన్ని నష్టాలు జరుగుతున్నాయని మైనార్టీ వార్డులను నష్టపోయే పరిస్థితి వస్తుందని అందువల్ల ఈ మున్సిపల్ వార్డుల విస్తరణ పై( డి లిమిటేషన్ ) హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకు వచ్చామని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తావ్వుర్ రహమాన్( కమాల్)అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కోర్టు స్టేను మున్సిపల్ మేనేజర్ కు అందించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ వార్డుల విస్తరణ పై అభ్యంతరాలు ఉంటే తెలపండి అని అప్పుడు నోటీసు బోర్డులో ఒక నోటీసును మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన పిదప తను అభ్యంతరాన్ని వ్యక్తం చేసిన దానిపై స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. ఒక ప్రక్క (సెన్సస్) జనగణన జరుగుతూ ఉంటే ఈ వార్డుల విస్తరణవల్ల ఉపయోగం ఏమీ లేదని అన్నారు. గతంలో మైనార్టీలకు సంబంధించిన ఆర్ వార్డులు ఉండయని తర్వాత ఐదు వార్డులుగా కుదించారని నేడు ఈ వార్డుల విస్తరణ వల్ల ఒకటి రెండు కే పరిమితం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెడన పట్టణంలో ఉన్న 23 వార్డులు అలాగే ఉంచాలని వాటి విస్తరణ అవసరం లేదని పేర్కొన్నారు.

# పురోహితుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు అమలు చేయాలి




**విజయవాడ: జూన్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పౌరహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా గుర్తించి, పురోహితుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా విజయవాడ గాంధనగర్‌లోని ఓ హోటల్‌లో శ్రీ వేద విజ్ఞాన పరిషత్ చైర్మన్ దేవరకొండ బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రాహ్మణ మేధావుల సదస్సులో ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ యామిజాల నరసింహమూర్తి, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పొదిల నారాయణమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు తెన్నేటి సునీల్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీధర్ శర్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగాభట్ల రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో పౌరహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా ప్రభుత్వం ఎందుకు గుర్తించాలి అనే అంశంపై వ్యవస్థాపకుడు యామిజాల నరసింహ మూర్తి మేధావులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి విచ్చేసిన ప్రత్యేక బ్రాహ్మణ మేధావి వర్గం పురోహితులు అనుభవిస్తున్న కష్టాలను అర్థం చేసుకుని అందరూ సంపూర్ణ మద్దతు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 2 లక్షల మంది పురోహితులకి భరోసా కావాలంటే కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టినట్లు పౌరహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా గుర్తించినట్లు ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేసి, పురోహితులు అందరికీ ఈఎస్ఐ ద్వారా వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇతర కులవృత్తుల తరహాలోనే పురోహితులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం, సాధనాలు, వడ్డీలేని రుణాలు అందించాలని, 'పురోహిత మిత్ర' రుణాలపై వడ్డీరేటు తగ్గించి, నిబంధనలు సరళతరం చేయాలని, గోదావరి పుష్కరాలతో సహా అన్ని పుష్కరాలు, కుంభమేళాల్లో ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జారీ చేసే గుర్తింపు కార్డును ప్రభుత్వం అధికారికంగా అనుమతించాలని, ప్రభుత్వం అన్ని కులవృత్తులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నప్పుడు, పౌరహిత్యానికి నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని, కాబట్టి అన్ని కులవృత్తి ప్రోత్సాహకాలను రద్దు చేయాలని, లేదా పౌరహిత్యాన్ని గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆయా అంశాలను పరిగణంలోకి తీసుకుని ప్రభుత్వం తక్షణం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య తరపున బ్రాహ్మణ మేధావి వర్గం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

**పౌరహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా గుర్తించాలి**

**బ్రాహ్మణ మేధావుల సదస్సులో వక్తలు**

## బిసి, ఎస్సీ ఎస్టీ, ముస్లిం మైనార్టీ వర్గాల వారికి వైయస్సార్ సిపి లో మాత్రమే న్యాయం. !



**గుడివాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** వైయస్సార్ సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తిరిగి మరల ముఖ్యమంత్రిగా, కొడాలి నానిని మంత్రిగా చేసుకోవడమే తన అంతిమ లక్ష్యమని వైసిపి ముస్లిం సంచార తెగల బిసి కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ షేక్ సయ్యద్ సోషల్ మీడియా ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో వైసిపి కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సజ్జల రామకృష్ణారెడ్డి బిసి, ఎస్సీ ఎస్టీ, ముస్లిం మైనార్టీ వర్గాలు రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయి కుల సంఘాలలో ప్రస్తుతానికి జరుగుతున్న పరిణామాల గురించి అడిగి తెలుసుకున్నారన్నారు. ముఖ్యంగా ఈ కూటమి ప్రభుత్వంలో బిసి, ఎస్సీ ఎస్టీ, ముస్లిం మైనార్టీ వర్గాల వారిని టార్గెట్ చేస్తూ విచ్చలవిడిగా దాడులు చేయడం, బెదిరించడం కూటమి ప్రభుత్వం తప్పులను ప్రశ్నించిన, తప్పులను ఎత్తి చూపిన అక్రమ కేసులు పెట్టడం, అలాగే దాడులకు తెగపడుతున్నారని షేక్ సయ్యద్ ఆరోపించడం జరిగింది. కూటమి నాయకులు ఇలా ఎన్ని చేసినా గుడివాడ నియోజకవర్గం పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా అభిమానులు భయపడకుండా ఎదురండి పోరాటం చేస్తున్నారని సజ్జల రామకృష్ణారెడ్డికు వివరించడం జరిగిందన్నారు. బిసి, ఎస్సీ ఎస్టీ, ముస్లిం మైనార్టీ వర్గాల వారికి వైయస్సార్ సిపి లో మాత్రమే న్యాయం జరుగుతుందని సయ్యద్ ఆశాభావం వ్యక్తం చేసారు.

## 10న కృష్ణా జిల్లాలో "అంకిత కమిషన్" పర్యటన

**గుడివాడ,జూన్ 8 (వార్తాప్రభ) :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులు (బీసీ) సామాజిక వర్గాలకు చెందిన వారికి స్థానిక సంస్థల్లో రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశాలపై సమకాలీన, కఠినమైన అనుభావిక విచారణ (Empirical Enquiry) నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్ (Dedicated Commission)ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్‌కు రాజీవ్ రంజన్ మిశ్రా, ఐఏఎస్ (రిటైర్డ్) ని చైర్మన్ గా నియమించింది. ఈ కమిషన్ ఉమ్మడి కృష్ణా జిల్లాలో జూన్ 10వ తేదీన పర్యటించనుంది. ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ మిశ్రా, చైర్మన్ వారి అధ్యక్షతన జిల్లా స్థాయిలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు, సామాజిక సంస్థలు, ప్రజా సంఘాలు, మేధావులు మరియు ఇతర సంబంధిత వర్గాల నుండి అభిప్రాయాలు, వ్యక్తిగత సూచనలు, వినతిపత్రాలను స్వీకరించనున్నారు. కావున, ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని అన్ని సంబంధిత వర్గాలవారు ది. 10-06-2026 ఉదయం 10-00 గంటలకు PGRS సమావేశ మందిరము, కలెక్టరేట్ ప్రాంగణం, మచిలీపట్నం నందు స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్ల ప్రభావం, సామాజిక-ఆర్థిక పరిస్థితులు మరియు ఇతర సంబంధిత అంశాలపై ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు మరియు సంఘాల వారు తమ లిఖితపూర్వక అభిప్రాయాలను రాజీవ్ రంజన్ మిశ్రా, చైర్మన్ వారికి నేరుగా సమర్పించవచ్చు. కావున, ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని అన్ని సంబంధిత వర్గాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనవలసినదిగా కోరడమైనది.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**హైదరాబాద్,జూన్ 8 (వార్తాప్రభ) :** భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కీర్తిశేషులు చంద్ర రాజేశ్వరరావు 112 వ జయంతి హైదరాబాదులోని కొండాపూర్ సి ఆర్ అకాడమీలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా పూర్వ శాసనసభ నియోజకవర్గ కేంద్రం అమ్మనబ్రోలు శ్రీ చివుకుల శ్రీరామ శర్మ జిల్లా పరిషత్ హై స్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. ఈ సమావేశంలో శాసనమండలి మాజీ సభ్యులు, ఏఐటీయూసీ నేత పాదర్తి జయ చంద్రశేఖర్ (1960 65 బ్యాచ్) సీనియర్ జర్నలిస్ట్, ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి నిమ్మరాజు చలపతిరావు, అమ్మనబ్రోలు వెంకట సత్యనారాయణ (రిటైర్డ్, ప్రభుత్వ ముద్రణాలయం), అమ్మనబ్రోలు రాంబాబు (రిటైర్డ్, కస్టమ్స్ సెంట్రల్ ఎక్సైజ్) (1972-77 బ్యాచ్) పాల్గొన్నారు. స్థానికంగా స్థిరపడ్డ తమ హై స్కూల్ పూర్వ విద్యార్థులు త్వరలోనే కలుద్దామని నిర్ణయించుకున్నారు.



ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకి కే నాగిరెడ్డి సహకారంతో ఏలూరు రోడ్డు డివిఎస్ కాంప్లెక్స్ నందు ఉచిత మజ్జిగ మరియు మినరల్ కూలింగ్ వాటర్ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గంటా చంద్రశేఖర్, సెక్రెటరీ ఎం లక్ష్మీనారాయణ రెడ్డి, ట్రెజరర్ తాత భాస్కర్, ఎలక్ట్రిక్ గవర్నర్ ఎం సి హెచ్ నారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, డి వి సత్యనారాయణ, స్వీట్ కొట్టు రాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగినది.

**-గుడివాడ,జూన్ 8 (వార్తాప్రభ) :**

## ముగిసిన రావెళ్ల కృష్ణ మెమోరియల్ కృష్ణా జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు

● బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్ రాజా , టిడిపి ఇన్చార్జి కనపర్తి.

**చల్లపల్లి/అవనిగడ్డ,జూన్ 8 (వార్తాప్రభ) :** రావెళ్ళ కృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో పదకొండు రోజుల పాటు నిర్వహించిన కృష్ణా జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ముగిశాయి.దివంగత మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ ఫ్రంట్ చైర్మన్ నందమూరి తారక రామారావు జయంతి, మాజీమంత్రి, దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా తెదెపా దివంగత నేత రావెళ్ళ కృష్ణ పేరిట ఆయన తనయులు రావెళ్ళ ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్ లు రావెళ్ళ కృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ను గత నెల 28న అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి కనపర్తి శ్రీనివాసరావు,సిఐ ఈశ్వరరావు చేతులమీదుగా ప్రారంభించారు.ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ తమ క్రీడా ప్రదర్శనతో పోటీలకు వన్నె తెచ్చారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలు ఆద్యంతం ఆసక్తికరంగా, ఉత్కంఠభరితంగా సాగాయి. ఎంఎల్ఏలు మండలి బుద్ధప్రసాద్,వర్ల కుమార్ రాజా చేతులమీదుగా బహుమతి ప్రదానం. రావెళ్ళ కృష్ణ సేవా సమితి వేదికగా విద్య, వైద్య అవసరాలతో పాటు పకృతి విపత్తులు సంభవించినప్పుడు ఆపత్కాలంలో సేవలందిస్తూ ప్రజాదరణ పొందుతూ తండ్రి ఆశయాలను నెరవేర్చడానికి నిరంతరం శ్రమిస్తున్న రావెళ్ళ ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్ లను అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్,వర్ల కుమార్ రాజా లు అభినందించారు.యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు వ్యయప్రయాలలకోర్చి టిడిపి దివంగత నేత,తమ తండ్రి రావెళ్ళ కృష్ణ పేరిట జిల్లా స్థాయిలో టోర్నమెంట్ నిర్వహించడం అనితరసాధ్యమని కొనియాడారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు





కనపర్తి శ్రీనివాసరావు , మండలి వెంకట్రామ్ లు మాట్లాడుతూ రావెళ్ల కృష్ణ సేవా సమితి సేవలను అభినందించారు. ముందుగా ఎన్టీఆర్, మండలి వెంకట కృష్ణారావు, రావెళ్ల కృష్ణ చిత్రపటాలకు ఎమ్మెల్యేలు, నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**టోర్నమెంట్ విజేత మెరకనపల్లి జట్టు..** టోర్నమెంట్ ఫనల్ లో మెరకనపల్లి బలరాం 11 జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన మెరకనపల్లి జట్టు కెప్టెన్ బలరాం సహా జుట్టు సభ్యులకు ట్రోఫీని అందించి రూ.30వేల నగదు బహుమతిని ఎమ్మెల్యేల చేతులమీదుగా అందించారు. రన్నరప్ గా నిలిచిన మంగళాపురం జట్టు కెప్టెన్ దీప్ చందుకు ట్రోఫీ, రూ.20వేల నగదు బహుమతిని, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును బలరాం 11 టీముకు చెందిన ముచ్చు అయ్యప్పకు అందచేశారు.

**అలరించిన కర్రసాము ప్రదర్శన..** భారతీయ సాంప్రదాయ కళారూపమైన కర్రసామును బాలలు ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు. బాలల కర్రసాము ప్రదర్శన అలరించగా, విద్యార్థులను, ట్రైనర్ కన్నబాబును ఎమ్మెల్యేలు,ఆహూతులు అభినందించారు.

**ప్రతిభకు నగదు ప్రోత్సాహం..** ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విభాగంలో జిల్లా స్థాయి టాపర్ గా నిలిచిన టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా నేత మహమ్మద్ హాఫీజుర్ రెహమాన్ (ఎసి.బాబు) కుమారుడు, అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి మహమ్మద్ కలాంకు టోర్నమెంట్ ముగింపు సందర్భంగా రావెళ్ల కృష్ణసేవా సమితి చైర్మన్ రావెళ్ల ఉదయ్ కుమార్ ప్రోత్సాహకంగా రూ.10వేల నగదు బహుమతిని ఎమ్మెల్యేల చేతులమీదుగా అందించారు.

## ప్రభుత్వ యంత్రాంగాలన్నిటి నుండి ప్రజలు మెరుగైన సమాచారం అందుకునేందుకు అవగాహన

-లీగల్ అవేర్నెస్ వాచ్ రాష్ట్ర అధ్యక్షులు. నటుకుల శ్రీనివాసరావు

**మార్కాపురం,జూన్ 8 (వార్తాప్రభ) :** మార్కాపురం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగుతున్నటువంటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పి జి ఆర్ ఎస్) కు మార్కాపురం జిల్లాలోని వివిధ గ్రామాల నుండి విచ్చేయుచున్నటువంటి ప్రజలకు అనేక అంశాల పైన అవగాహన కల్పించడం కోసం లీగల్ అవేర్నెస్ వాచ్ రాష్ట్ర అధ్యక్షులు నటుకుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఒక పుస్తకాల స్టాల్ ను ఏర్పాటు చేయడమైనది. ఈ స్టాల్ లో భారత రాజ్యాంగం మినీ పుస్తకాలు, సమాచార హక్కు చట్టానికి సంబంధించిన పుస్తకాలను ప్రజలకు అందు బాటులో ఉంచడం అయినది. ఈ సందర్భంగా నటుకుల మాట్లాడుతూ ఏకలవ్య ఫౌండేషన్ ద్వారా ప్రేరన తో తాము వివిధ ప్రాంతాలలో కూడళ్లలో ప్రజలకు సమాచార హక్కు చట్టం గురించి భారత రాజ్యాంగం గురించి పౌరుల యొక్క విధులు హక్కుల గురించి వివరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. తమ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ యంత్రాంగాలన్నింటికీ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ సహకరిస్తూ మిత్రభావంతో వ్యవహరించి ప్రభుత్వ యంత్రాంగాల నుండి మెరుగైన సేవలు పొందేందుకు ప్రజలకు అవగాహన కల్పించడం మరియు భారత రాజ్యాంగం నిర్వహించిన పౌర విధులకు ,బాధ్యతలకు నిర్వర్తించడం ద్వారా రాజ్యాంగబద్ధమైన హక్కులను పొందవచ్చు అనే విషయాన్ని ప్రజలకు అవగాహన కలిగించడం కూడా చేస్తున్నామన్నారు. అంతేకాకుండా భారత రాజ్యాంగంలో నిర్వహించబడినట్టుగా పౌర విధులను బాధ్యతలను నిలవర్తించడం



ద్వారా మెరుగైన సమాజ నిర్మాణం కోసం కృషి చేసేందుకు ప్రజలకు భారత రాజ్యాంగం ఆర్టికల్ 51 ఏ పైన కూడా ప్రజలకు కనీస అవగాహన కల్పిస్తున్నామన్నారు. అంతేకాకుండా సమాచార హక్కు చట్టాన్ని కీర్తి కోసం గుర్తింపు కోసం ఆదాయపు వనరుగా వినియోగిస్తూ సమాచారాకు చట్టాన్ని పరోక్షంగా బలహీన పరుస్తున్న వారి పట్ల ప్రభుత్వ యంత్రాంగం చట్టబద్ధంగా వ్యవహరించేలా ప్రభుత్వ యంత్రాంగాలకు సహకరించడం సమాచారకు చట్టం 2005 బలోపేతం అయ్యేందుకు మరియు సక్రమంగా అమలయేందుకు కృషి చేయడం కూడా తమ విధి అన్నారు. యువ న్యాయవాది పిన్నిక నాగార్జున ప్రసాద్ (గ్రాచీ )యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న ప్రధాన చట్టాలపై ప్రజలకు అవగాహన కలిగించడం గ్రామసభ ప్రాధాన్యతను గ్రామస్తులకు తెలిపి వారు గ్రామసభలు నిర్వహించుకొని తమ తమ గ్రామాలకు అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకునే విధంగా వారిని ప్రోత్సహించడం దానితో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవ పత్రం ప్రదర్శించేలా ప్రభుత్వ యంత్రాంగాలను ప్రోత్సహించడం తమ లక్ష్యం అని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నుండి ప్రజలకు అందుతున్న అన్ని రకాల సేవలు నిర్దేశిత సమయంలో ప్రజలకు అందేలా కృషి చేయడంతో పాటు రాష్ట్ర లోకాయుక్త ఉపలోకాయుక్త రాష్ట్ర మరియు జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర మరియు జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ జిల్లా మరియు మండల న్యాయ సేవాధికార సంస్థ జిల్లా మరియు రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ సెల్ జిల్లా అవినీతి నిరోధక శాఖ రాష్ట్ర మరియు కేంద్ర విజిలెన్స్ రాష్ట్ర మరియు కేంద్ర సమాచార హక్కు చట్టం కమిషన్ జిల్లా రాష్ట్ర మరియు జాతీయ వినియోగదారుల ఫోరం తదితర సంస్థలకు చేయబడే ఫిర్యాదుల విషయంలో ప్రజలకు సహకరించడం తమ ముందు ఉన్నటువంటి కర్తవ్యమని యాదవ్ తెలియజేశారు... కలెక్టర్ వారి కార్యాలయ ఆవరణలో విచ్చేసినటువంటి దరఖాస్తుదారులకు ప్రజలకు అవగాహన కల్పించడం కోసం పోస్టర్ల ద్వారా కూడా ప్రచారాన్ని నిర్వహించామని ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్, కార్యవర్గ సభ్యులు ఇల్లూరి రంగస్వామి గౌడ్, విశ్రాంత అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం చెంచయ్య ,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పిన్నిక చక్రపాణి యాదవ్ ,గాలయ్య, అజయ్ కుమార్ యాదవ్, శ్రీనివాస్ వాల్మీకి తదితరులు ఉన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..

-అప్రమత్తంగా ఉండాలని పార్టీ క్యాడర్ కు బూరగడ్డ శ్రీకాంత్ సూచన

**గుడివాడ,జూన్ 8 (వార్తాప్రభ) :**ఓటరు జాబితాలో ప్రత్యేక సవరణ కార్యక్రమం నేపథ్యంలో గుడివాడ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాల పరిశీలనను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని గుడివాడ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలకు పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన శ్రేణులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమైన అంశం అన్నారు. అర్హుడైన ప్రతి ఒక్క ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అనర్హుల పేర్లు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ (సర్) కార్యక్రమం పై పార్టీ శ్రేణులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుడివాడ నియోజకవర్గంలోని ప్రతి బూతు స్థాయిలో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకొని పనిచేయాలని సూచించారు. ఫోటో, జాబితాలో పేర్ల చేర్పు , తొలగింపు, మార్పులు వంటి అంశాలపై పూర్తి అవగాహనతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ నుండి జూలై 14 వ తేదీ వరకు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం



జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో లో పట్టణ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్, జిల్లా కార్యదర్శి కొదమల గంగాధరరావు, గుడ్లవల్లేరు మండలం అధ్యక్షులు తోట చిన్నారి, వడ్లమన్నాడు పిఏసిఎస్ అధ్యక్షులు అడపా బాబీ, నాయకులు కందుల రవి, దాసరి మహేష్, సుంకర వెంకట్, షేక్ మీరా షరీఫ్, షేక్ నాగూర్ బాషా, లోయ రాజా, ఏడుకొండలు, దుర్గారావు, బట్టు రవి కిరణ్, వీర మహిళలు దుర్గా, శిరీష, నాగరాణి, జనసేన కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, భారీ సంఖ్యలో జనసైనికులు తదితరులు హాజరయ్యారు.

## పోలీస్ అంగన్వాడి పాఠశాలకు సామాగ్రి వితరణ



**గుడివాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** స్థానిక పాటిమీద జగన్నాథపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు గురువారం తెలుగుదేశం నాయకులు వంట సామాగ్రి అందజేశారు. అంగన్వాడీ సిబ్బంది స్థానిక నాయకులను కోరగా వెంటనే వారు స్పందించి విద్యార్థులకు అవసరమైన రెండు కుక్కర్లు, పళ్లెలు, గ్లాసులు, గరిటెలు, వడ్డన గిన్నెలు వారికి కానుకగా విద్యార్థులకు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో దాతలు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, 32వ వార్డు ఇంచార్జీ చందు శ్రీనివాసరావు, 33వ వార్డు ఇంచార్జీ కోడూరు ప్రభు లు అందజేశారు ఈ కార్యక్రమంలో మూడెడ్ల శ్రీధర్, చిత్త జల్లు నాని, సురేష్, అన్నపురెడ్డి కోటయ్య, ఎక్కల కిషోర్, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన యోగా రిజిస్ట్రేషన్లు

- ఎంపీడీవో చిన్న రాట్నాలు



**విస్సన్నపేట,జూన్ 8 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో 15 సచివాలయాల పరిధిలో యోగా రిజిస్ట్రేషన్ లు యోగ మాస్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో ట్రైనర్ లు యుద్ధ ప్రాతిపదికన రిజిస్ట్రేషన్ లు చేస్తున్నట్లు ఎంపీడీవో చిన్న రాట్నాలు తెలియజేశారు. ఇది ఒక యజ్ఞం లా ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల ఉద్యోగులతో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శులు హరికృష్ణ కుమార్, నరేంద్ర, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా గుణాన్ని అందరూ అలవర్చుకోవాలి

-ఆక్వా కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తికొండ శ్రీరాజబాబు



**గుడివాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి అనే గుణం అందరికీ కలగాలని ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఆక్వా కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తికొండ శ్రీరాజబాబు అన్నారు. సోమవారం గుడివాడ పట్టణ భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఆధ్వర్యంలో స్థానిక ఆటోనగర్ రెండో లైన్ నందు గల లారీ ట్రాన్స్పోర్ట్ అధినేత, బిజేపీ నాయకులు లింగం చిట్టిబాబు నేతృత్వంలో.. వారి ఆఫీసు దగ్గర మజ్జిగ చలివేంద్రాన్ని రాష్ట్ర ఆక్వా బోర్డు డైరెక్టర్ గుత్తికొండ శ్రీ రాజబాబు ప్రారంభించారు. అనంతరం శ్రీ రాజబాబు మాట్లాడుతూ సేవకు మారుపేరైన ఆర్ఎస్ఎస్ నుంచి మేమందరం తమ వంతు సేవ చేయడం నేర్చుకున్నామని, దేశంలో ఏ కష్టం వచ్చినా ఎక్కడ విపత్తు వచ్చినా ముందుండేది ఆర్ఎస్ఎస్ అని ఆ సంస్థ నుండి వచ్చిన మేము సేవ చేయటంలో ముందుంటామని స్పష్టం చేశారు. కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు సూరే లక్ష్మీనారాయణ (గాంధీ) మాట్లాడుతూ లింగం చిట్టిబాబు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని, అలాంటివారు బిజెపిలో ఉండటం శుభ పరిణామం అని అన్నారు. ప్రజాసేవలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేస్తున్న సేవలను మనం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. మరో ఉపాధ్యక్షులు అంగడాల సతీష్ మాట్లాడుతూ లింగం చిట్టిబాబు చేస్తున్నటువంటి సేవలను కొనియాడారు. ప్రతి భారతీయ జనతా పార్టీ కార్యకర్త ప్రజా సేవకులు అవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మజ్జిగ దాత భారతీయ జనతా పార్టీ నాయకులు లింగం చిట్టిబాబు, పట్టణ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ, పి బద్రీనాథ్, మహిళా మోర్చా నాయకురాలు బోనం గోపిక, రీటా, శలంకాయల లీలా కుమారి, పెద్ద సంఖ్యలో ఆటోనగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కరుణశ్రీ పరిశోధనకు డాక్టరేట్



**అమలాపురం,జూన్ 8 (వార్తాప్రభ) :** అమలాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకురాలు పి.కరుణశ్రీ డా. బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో దేవాలయ-పర్యాటక ఆకర్షణలు అనే అంశంపై ప్రొఫెసర్.డా.జి.సోమ శేఖరం నిర్దేశకత్వంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరుకు సమర్పించిన పీ.హెచ్.డి అధ్యయన గ్రంథానికి గాను చరిత్ర విభాగంలో డాక్టరేట్ ను ప్రధానం చేశారు.కోనసీమ సప్తనదీపాయల మధ్య దేవాలయాల ప్రత్యేకతలు,కేరళను తలపించే ప్రాకృతిక అందాలు,సంస్కృతి, నదీపాయల సోయగాలు, పచ్చని కొబ్బరి తోటలు,పంటచేలు గురించి వివరిస్తూ ఇవి అన్నియు పర్యాటక రంగానికి ఏవిధంగా అభివృద్ధి కారకాలుగా నిలుస్తున్నాయో విశదపరుస్తు ఆరు అధ్యాయాలతో కూడిన పరిశోధన గ్రంథాన్ని సమర్పించినట్లు కరుణశ్రీ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వి.నరసింహ స్వామి, సీనియర్ అధ్యాపకులు డా.బాలాస్వామి, డా. ఆశీష్ బాబు తదితర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## ఈ నెల 10న గౌరవ రాజీవ్ రంజన్‌మిశ్రా పర్యటన

● ఈ సందర్శనను సద్వినియోగం చేసుకోవాలి ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, జూన్ 8 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించి అధ్యయనానికి ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ గౌరవ రాజీవ్ రంజన్ మిశ్రా ఈ నెల 10న ఉమ్మడి కృష్ణా జిల్లాలో పర్యటించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా, మచిలీపట్నం కలెక్టరేట్ ప్రాంగణంలోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు తదితర వర్గాల నుంచి అభిప్రాయాలు, సూచనలు, వినతిపత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి వ్యక్తులు, సంస్థలు, సంఘాలు బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్ల ప్రభావం, సామాజిక, ఆర్థిక పరిస్థితులు వంటి అంశాలపై లిఖిత పూర్వక అభిప్రాయాలు ఛైర్మన్ వారికి లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని సంబంధిత వర్గాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

# మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవత్వం

**● ఐదు కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక చేయూత ● బాధిత కుటుంబాలకు అండగా .. విద్యార్థిని భవిష్యత్తుకు భరోసా ● ఆపదలో అండగా నిలిచిన మంత్రి సుభాష్**



**రామచంద్రపురం,జూన్ 8 (వార్తాప్రభ) :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన ఔదార్యాన్ని, మానవత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఐదు కుటుంబాలకు మొత్తం లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. బాధలో ఉన్న వారికి ధైర్యం చెప్పడం, అవసరమైన సమయంలో చేయూతనివ్వడం తన బాధ్యతగా భావిస్తూ మంత్రి సుభాష్ అందిస్తున్న సహాయం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఇటీవల రామచంద్రపురం రూరల్ మండలం వేగాయమ్మపేటకు చెందిన గుబ్బల సూరిబాబు పొలంలో జరిగిన గడ్డివాము అగ్నిప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సుభాష్, భార్య గుబ్బల మల్లేశ్వరికి రూ.30,000 ఆర్థిక సహాయం అందించి ధైర్యం చెప్పారు. అలాగే కాజులూరు మండలం కుయ్యేరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పెంకే నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా, ఆయన కుమారుడు పెంకే సూర్య చంద్రశేఖర్‌కు రూ.30,000 ఆర్థిక సహాయం అందించి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. పేద పురోహితులు సరస్వతి శ్రీ స్వామి విజయానంద స్వామికి రూ.10,000 ఆర్థిక సహాయం అందించి వారి అవసరాలకు అండగా నిలిచారు. అలాగే ద్రాక్షారామం బియ్యంపేటకు చెందిన కోడూరి శ్రవణ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, ఆయన కోలుకునే వరకు నెలకు రూ.10,000 చొప్పున సహాయం అందిస్తానని హామీ ఇచ్చిన మంత్రి సుభాష్, ఆ హామీని నిలబెట్టుకుంటూ మూడో నెలకు సంబంధించిన రూ.10,000ను ఆయన తల్లి జ్యోతికి అందించారు. అదేవిధంగా అమలాపురానికి చెందిన నిరుపేద విద్యార్థిని కేశనకుర్తి హర్షిత ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించేందుకు రూ.20,000 ఆర్థిక సహాయం అందించి విద్యకు ప్రోత్సాహం ఇచ్చారు. ఈ విధంగా వివిధ కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలు, ఒక విద్యార్థినికి కలిపి మొత్తం రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించిన మంత్రి సుభాష్, సమాజం పట్ల తనకున్న బాధ్యతను మరోసారి చాటుకున్నారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలుస్తూ, అవసరమైన వారికి సహాయం అందిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్ సేవలను ప్రజలు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందిస్తున్నారు. సామాజిక బాధ్యతతో ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నాయని కొనియాడుతున్నారు.

# రాష్ట్రాభివృద్ధికి ప్రణాళిక సానా సతీష్ కు రాజ్యసభ : మోసా అబ్రహం





**కాకినాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** రాష్ట్రాభివృద్ధికి ప్రణాళిక లో భాగంగానే సానా సతీష్ బాబును మరోసారి రాజ్యసభ సభ్యుడిగా నియమించడం జరిగిందని క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అబ్రహాం అన్నారు.సోమవారం కాకినాడ దుమ్ములపేట విక్టరీ రివైవల్ సెంటర్ మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సమర్ధ వంతమైన నాయకుని తో రాష్ట్రంతో పాటుగా కాకినాడ జిల్లా అభివృద్ధి చెందుతుందనే ముందు చూపుతో సానా సతీష్ బాబు ను రెండో సారి రాజ్యసభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఎంపిక చేసారని ఆయన అన్నారు.క్రీడలు, ఉపాధి,ఆరోగ్యం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో ఆయన కొనసాగిస్తున్న కృషి ఎనలేనిదని,కాకినాడలో గల తన కార్యాలయంలో ప్రత్యేకంగా ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కారానికి కృషి జరిగిందన్నారు.కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా రాష్ట్రానికి తీసుకురావడానికి అవకాశం లభించిందన్నారు. పోలవరం నిర్మాణం త్వరితగతిన నిర్మాణం పూర్తవుతుందన్నారు. రాజ్యసభ కు సానా సతీష్ బాబును ఎంపిక చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రతి నెల క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సుమారు వందమంది పాస్టర్స్ తో రాష్ట్ర కొరకు ప్రే ఫర్ ఆంధ్ర ప్రదేశ్ అనే ప్రార్ధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కే.మోజేష్ కుమార్,రాష్ట్ర సెక్రటరీ ప్రభాకర్,రాష్ట్ర కోశాధికారి శ్రీఫణీ,జిల్లా నాయకులు ఏసుదాసు, జార్జి బాబు,సురేష్ జాన్సన్, పి.సల్మాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జంక్షన్ మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**హనుమాన్ జంక్షన్, జూన్ 8 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ ఏలూరు రోడ్ లోని మానవతా కార్యాలయంలో 2026 –2027 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు చేయించారు. ఈ కార్యక్రమానికి బాణాల నరసింహారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధులుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కండెపు సూర్యనారాయణ, విశిష్ట అతిథిగా ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు కొండ్రెడ్డి వెంకట సత్యనారాయణ అతిధులుగా ఉమ్మడి కృష్ణాజిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరి వీర శేషగిరిరావు, పర్యావరణ కమిటీ ఉమ్మడి కృష్ణాజిల్లా చైర్మన్ దండమూడి జయలక్ష్మి పాల్గొన్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా ఘంటా ఇందిరాదేవి, కార్యదర్శి గా పాబోలు గణేష్ బాబు, ట్రెజరర్ మరీదు వెంకటస్వామి, ఉపాధ్యక్షులు గా చోడే లక్ష్మణరావు, సహాయ కార్యదర్శి గా నారగాని కొండలరావు, కార్యవర్గ సభ్యులుగా దయాల ప్రభాకరరావు, బెజవాడ శ్రీరామ్మూర్తి, నరహరశెట్టి శ్రీధర్,గోళ్ళ మల్లికార్జునరావు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం హాజరైన సభ్యులకు విందు భోజనం ఏర్పాటు చేశారు పండుగ వాతావరణంలో ఆహ్లాదకరంగా ప్రమాణ స్వీకారం పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి నూజివీడు, కైకలూరు, గుడివాడ నుండి మానవతాశాఖల ప్రతినిధులు హాజరయ్యారు.

## బంటుమిల్లి కాలువ గట్టులు పటిష్టంవంతం కు చర్యలు



**పెడన,జూన్ 8 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశానుసారం కమలాపురం డిసి పరిధిలోని బంటుమిల్లి ప్రధాన కాలువ గట్లు బలపరుచు పనులను కూటమి నాయకుల సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం నాయకుడు నల్లమోతు రఘురామ్ టీడీపీ నాయకులు కొట్టే వీర రాఘవులు గాజుల వేణు జనసేన మండల అధ్యక్షుడు ఊసా వెంకయ్య చేవేంద్ర నీటి సంఘం అధ్యక్షులు చెన్నంశెట్టి సోంబాబు నల్లమోతు శ్రీనివాసరావు పోతన ఏడుకొండలు ఇరిగేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యం బాధపడుతున్న లగడపాటి నీ పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ



**పెనుగంచిప్రోలు, జూన్ 8 (వార్తాప్రభ) :** జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు మండలం, పెనుగంచిప్రోలు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న తన చిన్ననాటి స్నేహితుడు, తిరుపతమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ లగడపాటి వెంకటేశ్వర్ రావు ని జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ మరియు జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు...

## జనతా వారిధి ప్రజా సమస్యలపై సమాధానంలో చిలుకూరి రాంకుమార్




**రౌతులపూడి,జూన్ 8 (వార్తాప్రభ) :** రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెం గ్రామంలో బీజేవైఎం పూర్వ అధ్యక్షులు చిట్రా పాపారావు ఆధ్వర్యంలో జనతా వారధి కార్యక్రమం విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా పూర్వ అధ్యక్షులు చిలుకూరి రాంకుమార్ అధ్యక్షత వహించారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన జనతా వారధి ప్రజా సమస్య లపై సమాధానం అనే కార్యక్రమం ప్రతి ఒక్క సమస్యను ప్రత్యక్షంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను నేరుగా ప్రభుత్వ అధికారులకు తెలియచేయటమే దీని ఉద్దేశం అని రాంకుమార్ పేర్కొన్నారు. ప్రజలకు సమస్య సమాంతరంగా సజావుగా మంచి ఉన్నతమైన ఆలోచనతో ఈ ప్రభుత్వం ఎప్పుడు ప్రజా సంక్షేమం ప్రజా సమస్యల మీద కృషి చేస్తుందని మీరు సమస్యలను పరిష్కరించకుండే దిశగా మాతో సహకరి ంచాలని ఈ కార్యక్రమాన్నిదేశించి మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వ అధికారులకు మధ్య సమస్యలు పరిష్కరించేదే జనతా వారధి ఈ మండలంలో ప్రతి గ్రామంలోనూ ఈ జనతా వారధి ప్రారంభిస్తామని మీ సమస్య పరిష్కారం కొరకు ఎప్పుడు మీ కోసం బిజెపి పార్టీ పనిచేస్తుందని రామ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు శ్రీనివాస్, సీనియర్ నాయకులు తంటపరెడ్డి మాణిక్యం, వీరబాబు, అప్పారావు, గణేష్ గ్రామ ప్రజలు అభిమానులు పాల్గొన్నారు.

# విజయవాడ పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం ఘనంగా జరిగింది




**విజయవాడ,జూన్ 8 (వార్తాప్రభ) :** విజయవాడ పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం స్థానిక హోటల్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి వందలాది మంది పాస్టర్లు, క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు. సమావేశానికి ప్రముఖ క్రైస్తవ నాయకులు, యునైటెడ్ క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఇండియా కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. కోలా ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విజయవాడ పాస్టర్స్ ఫెలోషిప్ చీఫ్ పాట్రన్స్ డా. దేవ దండల హోస్ట్ చేయగా , బిషప్ రక్షణానంద్ ఇతర ప్రముఖ క్రైస్తవ నాయకులు పాల్గొని దేవుని వాక్యాన్ని బోధించారు. ఫెలోషిప్ సెక్రటరీ రెవ. బి రవికాంత్, ట్రెజరర్ రెవ. బి రాజు తదితర నాయకులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ క్రైస్తవ సమాజమంతా ఐక్యంగా ఉండి దేశ శ్రేయస్సు కోసం, సమాజంలో నైతిక విలువల పెంపుదల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేవుని వాక్యమైన బైబిల్ బోధించిన ప్రకారం రాజులు, అధికారులు సమస్త ప్రజల కొరకు ప్రార్థనలు, విజ్ఞాపనలు చేయాలని సూచించారు. దేశంలో శాంతి, సామరస్యం, ఆధ్యాత్మిక విలువలు వృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమావేశం ఆధ్యాత్మిక సందేశాలు, ప్రార్థనలు పరస్పర సహవాసంతో ఆశీర్వాదకరంగా ముగిసింది.

# ప్రజల సంతృప్తే పనితీరుకు గీటురాయి..

**● సేవల నాణ్యతే సుపరిపాలనకు సరైన ప్రమాణం ● అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనంతో వ్యవహరించాలి ● నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనిపిస్తే చర్యలు తప్పవు ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, జూన్ 8 (వార్తాప్రభ) :** అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తే పనితీరుకు గీటురాయని.. సేవల నాణ్యతే సుపరిపాలనకు సరైన ప్రమాణమన్న విషయాన్ని గుర్తించి అధికారులు ప్రజల ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. అంతకుముందు కలెక్టర్ లక్ష్మీశ శాఖల వారీగా అర్జీల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంతవరకు ఎన్ని అర్జీలు అందాయి? ఎన్ని పరిష్కరించారు? పరిష్కార నాణ్యత.. తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత ప్రజాస్నేహపూర్వకంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం జిల్లాస్థాయి అధికారులు స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి, సమస్య పరిష్కారంపై వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కార నాణ్యతపై పూర్తి బాధ్యత సంబంధిత అధికారులదేనని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనిపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అర్జీలు పునరావృతం కాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఫిర్యాదులను స్వీకరించే సమయంలోనూ, పరిష్కరించే ప్రక్రియలోనూ అధికారులు నిబద్ధత, సహానుభూతితో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా సేవలు అందించడమే ప్రతి అధికారి ప్రధాన బాధ్యతగా భావించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

**జిల్లాస్థాయి కార్యక్రమానికి 151 అర్జీలు:** ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 151 అర్జీలు రాగా.. వీటిలో పురపాలన, పట్టణాభివృద్ధి శాఖకు 33, రెవెన్యూకు 29, పంచాయతీరాజ్‌కు 17, పోలీసు శాఖకు 14 అర్జీలు వచ్చాయి. అదేవిధంగా ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్‌కు 9 అర్జీలు రాగా విద్య, ఆరోగ్యం, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌కు ఆరు చొప్పున అర్జీలు వచ్చాయి. విద్యుత్, డీఆర్‌డీఏ, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు నాలుగు చొప్పున , పౌర సరఫరాలు 3, ఏపీఎస్ ఆర్టీసీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, రహదారులు-భవనాల శాఖలకు రెండు చొప్పున అర్జీలు అందాయి. బీసీ సంక్షేమం, సహకార, డ్వామా, ఎండోమెంట్, గృహ నిర్మాణం, ఇరిగేషన్, ఎల్‌డీఎం, ఆర్ఐవో, నైపుణ్యాభివృద్ధి విభాగాలకు ఒక్కో అర్జీ వచ్చాయి. ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిపెట్టి నిర్దేశ గడువులోగా నాణ్యతతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# పశు సంపదతో గ్రామాల్లో సుస్థిర సంపద

**● అన్నదాతలకు అదనపు ఆదాయానికి వీలు ● పాడి పశువుల్లో పునరుత్పత్తిపై ప్రత్యేక దృష్టి ● పశువుల ఉత్పాదకత పెంపునకు కార్యాచరణ ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, జూన్ 8 (వార్తాప్రభ) :** గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధికి పశుసంపద కీలకమని, పాడి పరిశ్రమ అభివృద్ధి ద్వారా రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్థిరమైన పాల ఉత్పత్తి ద్వారా రైతుల ఆదాయాన్ని సుస్థిరం చేసేందుకు పశు కేంద్రీకృత పునరుత్పత్తి నిర్వహణ విధానంపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి విలేజ్ హెర్డ్ ఫెర్టిలిటీ రిజిస్టర్ (వీహెచ్ఎఫ్ఆర్)ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల్లో సకాలంలో చూలు కట్టించకపోవడం వల్ల రైతులు గణనీయంగా నష్టపోతున్నారని.. అందువల్ల ప్రతి పాడి పశువును దాని పునరుత్పత్తి, ఉత్పత్తి జీవిత చక్రాన్ని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ సకాలంలో చూలు కట్టించడం, క్రమబద్ధమైన ఈతలు, అధిక పాల ఉత్పత్తి, మెరుగైన పశు ఉత్పాదకతను సాధించడం లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సకాలంలో ఈనే పశువుల వల్ల అధిక పాల దిగుబడి ఉంటుందని.. సకాలంలో చూలు కట్టించడం వల్ల అనుత్పాదక దినాలు తగ్గి రైతులకు అధిక ఆర్థిక లాభం కలుగుతుందన్నారు. అదేవిధంగా లింగ నిర్ధారిత వీర్యం వినియోగం వల్ల ఎక్కువ ఆడ దూడలు పుట్టి పాల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. కృత్రిమ గర్భధారణ, గర్భ నిర్ధారణ, వంధ్యత్వ నివారణ, పోషకాహార నిర్వహణ, దూడల సంరక్షణ వంటి శాస్త్రీయ పునరుత్పత్తి నిర్వహణ చర్యలు పశువుల ఉత్పాదకత పెంపులో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో పశు కేంద్రీకృత పునరుత్పత్తి నిర్వహణ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతోందని.. దీన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. ఎం.హనుమంతరావు, ఉపసంచాలకులు డా. కె.చంద్రశేఖర రావు, డా. మోజెస్ వెస్లీ, డా. ఎస్.నాగభూషణరావు, ఏడీ డా. సునంద, పశు వైద్యులు డా. మనోజ్, డా. పంకజ్, డా. చంద్రశేఖర్ నాయక్ పాల్గొన్నారు.

# తిరుపతమ్మ భక్తులకు కొరవడుతున్న రక్షణ

## –భక్తులపై దాడులకు పాల్పడుతున్న కొందరు వ్యాపారులు







**పెనుగంచిప్రోలు,జూన్ 8 (వార్తాప్రభ) :** ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం కు ప్రతినిత్యం వేలాది మంది భక్తులు ఆ తల్లి ఆశీస్సులు కొరకు వచ్చి మొక్కులు మొక్కి మొక్కులు నెరవేరిన తర్వాత తమ మొక్కుబడులు చెల్లించుకుని వెళ్తూ ఉంటారు. ప్రధానంగా శుక్రవారం, ఆదివారంలో వేలాదిమంది భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చి మొక్కుబడి చల్లించుకున్న అనంతరం మునేటి యువతలనున్న మామిడి తోటలలో తమ బంధు వర్గానికి విందులు ఏర్పాటు చేస్తారు. విందులకు అవసరమైన సామాగ్రి అలాగే వసతి సౌకర్యాలు కల్పిస్తూ భక్తులకు పెద్ద సంఖ్యలో వ్యాపారులు మామిడి తోటలో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గతంలో భక్తులు తో మర్యాదగా మెలిగిన వ్యాపారులు, భక్తుల అవసరాలను తమ సంపాదనకు మెరుగుపరుచుకునేందుకు అధిక ధరలు పెంచుతూ అదేమిటని ప్రశ్నించిన వ్యక్తులపై దాడులకు తెగబడుతున్నారు. ఆదివారం తెనాలి కొల్లూరు కు చెందిన భక్తులు మునేటి అవుతున్న వై.ఎన్.ఆర్. గార్డెన్ నందు తమ బంధు వర్గానికి విందు ఏర్పాటు చేసుకున్నందుకు కొందరు స్థానికులతో ఒప్పందం కుదిరించుకున్నారు. మొదట తమ వద్దకు వచ్చేందుకు తక్కువ ధర చెప్పి పని పూర్తయిన తర్వాత అనేక సాకులు చెబుతూ భక్తుల నుండి అధిక ధరలు డిమాండ్ చేశారు. దీంతో స్థానికులతో వారు మేము అంత రేటు ఇవ్వమని వాదనకు దిగడంతో కొందరు ఆకతాయిలు మాంసం నరికే కత్తులతో భక్తులపై దాడి చేశారు. ఈ దాడిలో పాలనకి శ్రీనివాసరరావు, గుడపాటి ఆంజినేయులు, శ్రీ పతి నాగరాజు, ఏమని వినోద్ నలు గ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. భక్తులు ఎవరైనా ప్రశ్నిస్తే వ్యాపారులందరూ ఏకమై ఎక్కడి నుంచో వచ్చిన కొద్దిపాటి భక్తులపై దాడులు చేస్తూ భక్తులను భయాందోళనలకు గురిచేస్తున్నారు. పలువురు భక్తులు తమకు న్యాయం చేయాలంటూ వెళ్లిన చోట కూడా రాజకీయ ఒత్తులతో బాధించబడిన వారే ఇబ్బందులకు గురవుతున్నారు. భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలుగుతున్న దేవాదాయ శాఖ అధికారులు మాత్రం మా ఆలయ పరిసరాల్లో గొడవలు జరగలేదని బయట ప్రైవేటు ప్రదేశాలలో జరిగితే మాకేమి సంబంధం అని అంటున్నారు. కానీ స్థానికులు మాత్రం ఇదేవిధంగా భక్తులను దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకుంటే రానున్న రోజుల్లో దేవాలయానికి వచ్చేందుకే భక్తులు భయపడతారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా భక్తుల పై దాడులకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకొని భక్తులకు మెరుగైన రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు భక్తులు స్థానికులు కోరుతున్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188